ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY





## సెలవులో కడప ఆర్డీవో మధుసూదన్

కడప(కలెక్టరేట్), జూలై 6: కడప రెవన్యూ డివిజనల్ అధికారి మధుసూదన్ పదిరోజులు సెలవులో వెళ్లారు. 6వ తేదీ నుంచి 15వ తేదీ వరకు వ్యక్తిగత కారణాలతో సెలవుపై వెళుతున్నట్లు కలెక్టర్‌కు లెటర్ పెట్టినట్లు తెలుస్తోంది. దీంతో కడప ఇన్‌చార్జి ఆర్డీవోగా జీఎస్‌ఎస్‌ఎస్ స్పెషల్ కలెక్టర్ కౌసర్ బాను వ్యవహరించనున్నారు. కాగా.. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పర్సనల్ సెక్రటరీగా మధుసూదన్‌రెడ్డి నియమితులు కానున్నారని, అందుకే సెలవు పెట్టి అమరావతికి వెళ్లారని ప్రచారం జరుగుతోంది.



## పులివెందులకు వచ్చిన మాజీ సీఎం

పులివెందుల, జూలై 6: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శనివారం పులివెందులకు వచ్చారు. సాయంత్రం 6గంటల ప్రాంతంలో ఆయన పులివెందులలోని తన ఇంటికి చేరుకున్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 75వ జయంతి వేడుకల్లో పాల్గొనేందుకు ఆయన మూడు రోజుల పర్యటనలో భాగంగా పులివెందులకు వచ్చారు. పార్టీ కార్యాలయంలో ఎదురుచూస్తున్న నాయకులను, అభిమానులను కలిశారు. పలువురితో సెల్ఫీలు దిగారు. అనంతరం తన ఇంటికి వెళ్లిపోయారు. ఈ కార్యక్రమంలో కడప ఎంపీ అవినాశ్‌రెడ్డి, ఎమ్మెల్యే అమరనాథరెడ్డి, మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ రమేశ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## 9న జడ్పీ సర్వసభ్య సమావేశం

కడప(రూరల్), జూలై 6: ఉమ్మడి కడప జిల్లా జడ్పీ సాధారణ సర్వసభ్య సమావేశాన్ని 9వ తేదీ మంగళవారం ఉదయం 10 గంటలకు జడ్పీ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు సీఈవో ఎం.సుధాకర్‌రెడ్డి తెలిపారు. జడ్పీటీసీ సభ్యులు, గౌరవ సభ్యులు, కడప, అన్నమయ్య జిల్లాల అధికారులు వారి ప్రగతి నివేదికలతో తప్పనిసరిగా హాజరుకావాలని తెలిపారు.

## ట్రిపుల్‌ఐటీలో గంజాయి పట్టుబడడం సిగ్గుచేటు

● ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి

వేంపల్లె, జూలై 6: ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో పరిపాలన అస్తవ్యస్తంగా తయారైందని, ఇక్కడ విద్యార్థుల వద్ద గంజాయి పట్టుబడటం సిగ్గుచేటని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి అన్నారు. ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ ఆదేశాల మేరకు శనివారం ఆయన ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీని సందర్శించారు. డైరెక్టర్ కుమారస్వామి గుప్త, ఏఓ రవికుమార్, ఇతర అధికారులతో సమావేశమయ్యారు. విద్యార్థుల వద్ద గంజాయి ఉండడం సంస్థకే సిగ్గుచేటని, ఇలాంటి ఘటనలు జరగడం దురదృష్టకరమన్నారు. సక్రమమైన పరిపాలన అందిస్తే ఈ పరిస్థితి ఉండేది కాదన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం పరిశీలించారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో ట్రిపుల్‌ఐటీలు అస్తవ్యస్తంగా అయ్యాయన్నారు. టీడీపీ ప్రభుత్వం ట్రిపుల్ ఐటీలను గాడిలోపెట్టి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ దేవస్థాన చైర్మన్ జీవీ రమణ పాల్గొన్నారు.

### ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్త రాజీనామా

ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్త తన పదవికి రాజీనామా చేశారు. హైదరాబాద్ జేఎన్టీయూలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఆయనను 8నెలల క్రితం ఇడుపులపాయ డైరెక్టర్‌గా వైసీపీ ప్రభుత్వం నియమించింది. ఎన్నికల అనంతరం టీడీపీ ప్రభుత్వం వచ్చింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు శనివారం రాజీనామా చేసినట్లు డైరెక్టర్ తెలిపారు. రిలీవ్ ఆర్డర్ వచ్చిన వెంటనే మాతృసంస్థకు వెళతానని తెలిపారు.



ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి

# ఆపరేషన్ పోలీస్..!

జగన్ పాలనలో ప్రజల సొమ్ముతో జీతాలు తీసుకుంటున్నామన్న ఇంగిత జ్ఞానం మరిచి ఐపీసీ చట్టాలకు బదులు వైసీపీ చట్టాలు అమలు చేశారు. జగన్ జమానాలో జనమే కాదు.. పోలీసులు కూడా బాధితులే. శాంతిభద్రతలు కాపాడాల్సిన ఖాకీలు కళ్లు మూసుకుని మరీ వైసీపీ నేతలకు అడ్డంగా సహకరించారు. జగన్‌దే 30 ఏళ్ల పాటు రాజ్యం, మేం చెప్పిందే వేదం అనే అహంకారంతో నిబంధనలు విడిచి నిస్సిగ్గుగా వైసీపీ నేతలతో అంటకాగారు. శాంతిభద్రతలు కాపాడాల్సిన కొందరు పోలీసులే అసాంఘిక శక్తులతో మిలాఖత్ అయి ఓ కొత్త సామ్రాజ్యాన్ని అంటే ముంబై తరహా మాఫియాను ప్రోత్సహించారనే విమర్శ ఉంది. బాధితుల పక్షాన నిలబడాల్సిన ఖాకీలు.. కాసుల కోసం అందులోనూ కబ్జాదారులకు వత్తాసు పలుకుతూ వైసీపీ నేతలకు ఊడిగం చేసి పోలీసు అంటే జనం కోసం కాదు వైసీపీ పెత్తనం కోసమే అన్నట్లుగా వ్యవహరించారంటారు. అలాంటి అవినీతి అధికారులపై ఇప్పుడు కత్తి వేలాడుతోంది. డీజీపీకి టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఫిర్యాదు చేయడంతో 'ఆపరేషన్ పోలీస్' మొదలైంది.




- డిఫ్యాక్ట్ ఎస్పీగా కొనసాగిన సీఐ అశోక్‌రెడ్డి
- ఖాకీ అని మరిచి వైసీపీ ఏజెంటుగా రాజు
- పోలీసు స్థలాలు అప్పనంగా వైసీపీ నేతలకు అప్పగింత
- జగన్ పాలనలో నిబంధనలు అతిక్రమించి..
- ఐపీసీ బదులు.. వైసీపీ సెక్షన్ అమలు చేసిన అధికారులే టార్గెట్
- ప్రశాంత కడప కోసం డీజీపీకి టీడీపీ ఫిర్యాదు

(కడప-ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల జగన్ హయాంలో కడపను భూకబ్జాలు, గంజాయి, సెటిల్‌మెంట్లకు వైసీపీ నేతలు అడ్డాగా మార్చేశారు. వీటన్నింటికి అప్పట్లో కడప సీఐగా పనిచేసిన అశోక్‌రెడ్డే కీలకం అనేది టీడీపీ నేతల ఆరోపణ. అశోక్‌రెడ్డి అంటే జగన్ జమానాలో స్పెషల్ బ్రాండ్. శివుడి ఆజ్ఞ లేకుండా చీమ కుట్టదేమో కానీ, ఉమ్మడి కడప జిల్లాలో అశోక్‌రెడ్డికి తెలియకుండా ప్రతిపక్ష నేతల అరెస్టులు కానీ, బెట్టింగ్ కానీ, జూదం కానీ ఎలాంటి సెటిల్‌మెంట్లు కానీ జరగలేదనే ఆరోపణలున్నాయి. ఈయనకు తోడుగా మరో సీఐ రాజు కూడా వైసీపీ నేతలతో అంటకాగారంటారు. రాయచోటిలో మున్సిపల్ ఎన్నికలు మొదలుకుని ప్రతిచోటా రాజు వైసీపీ భక్తిని చాటారనే విమర్శ ఉంది. ఈ ఇద్దరితో పాటు కడపలో గంజాయి, పోలీసు భూముల పరాధీనంపై ఆధారాలతో సహా డీజీపీకి టీడీపీ వారు ఫిర్యాదు చేయడంతో.. వారి బాధితులంతా.. పాపం పండుతుంది. చేసుకున్నోనికి చేసుకున్నంత అని సాంత్వన పొందుతున్నారు.

### ట్రబుల్ షూటర్

ఎలాంటి సమస్య వచ్చినా సరే.. దానితో ఇబ్బంది తలెత్తకుండా డీల్ చేసేవారిని ట్రబుల్ షూటర్ అంటుంటారు. సీఐ అశోక్‌రెడ్డికి అలాంటి పేరే ఉంది. అయితే ఈయన ప్రజల కోసం తన తెలివిని ఉపయోగించలేదు. వైసీపీ నేతల అక్రమాలకు రక్షణ కవచంగా తన తెలివినంతా వాడారనే అపవాదు ఉంది. అశోక్‌రెడ్డి కడపలో పనిచేసినప్పుడు వైసీపీ నేతలకు ఎంత పెద్ద సమస్య వచ్చినా సరే.. ఆయనకు అప్పజెబితే చిటికెలో సెటిల్ చేస్తాడనే పేరుంది. ఆయన చిన్నచౌకుతో పాటు రూరల్ సీఐగా పనిచేశారు. అప్పట్లో వైసీపీ నేతలకు చెందిన ఎన్నో ఇష్యూలను, ఎన్నో వివాదాలను అశోక్‌రెడ్డి సెటిల్ చేశారంటారు. ఏ పని అప్పజెప్పినా కూడా అశోక్‌రెడ్డి తన దైన స్టైల్‌లో సెటిల్ చేస్తారనే పేరుంది. చిన్నచౌకు ఇతర ప్రాంతాల్లో సెటిల్‌మెంట్లు, ఇతర వాటిపై పెద్దఎత్తున ఫిర్యాదులు వచ్చాయి.

### పేరుకే సీఐ.. అంతా డీఫ్యాక్ట్ ఎస్పీ

అశోక్‌రెడ్డి పేరుకే సీఐ. అన్నీతానై డీఫ్యాక్ట్ ఎస్పీగా ఉమ్మడిజిల్లాను చెడుగుడు ఆడుకున్నారంటారు. అశోక్‌రెడ్డి హయాంలో ఎస్పీగా అన్బురాజన్ పనిచేశారు. ఎంపీ అవినాశ్‌రెడ్డి, కడప మేయర్ సురేశ్‌బాబు, నాటి డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, నాటి ఎమ్మెల్యే రవిరెడ్డితో పాటు ఇతర చిన్న చితక వైసీపీ నేతలతో కూడా ఈయన బాగా అంటకాగారంటారు. వారు ఏ పని చెప్పినా సరే వెనకాడరని చెబుతారు. అప్పట్లో పేరుకే ఎస్పీ అన్బురాజన్.. డీఫ్యాక్ట్ ఎస్పీగా అశోక్‌రెడ్డి కొనసాగారంటూ ఆరోపణలు వచ్చాయి. ఉమ్మడి కడప జిల్లాలో డీఎస్పీల పోస్టింగ్ నుంచి సీఐలు, ఎస్ఐలు ఇలా ఎవరు బదిలీ కావాలన్నా ఎవరు ఎక్కడికి వెళ్లాలన్నా కూడా అశోక్‌రెడ్డి గ్రీన్‌సిగ్నల్ ఇస్తేనే జరిగేదని అంటారు. అప్పట్లో పోలీసులు కూడా పోస్టింగు కోసం పొలిటికల్ నేతలకన్నా అశోక్‌రెడ్డి ప్రాపకం కోసం పాకులాడేవారంటారు.

### బీటెక్ రవి అరెస్టుతో..

అశోక్‌రెడ్డి కడపలో పనిచేసే సమయంలో ఆయనపై పెద్దఎత్తున ఆరోపణలు వచ్చాయి, ఎన్నికలకు ముందు స్పెషల్ బ్రాంచ్‌లోకి వెళ్లిపోయారు. ఆయన ఆధ్వర్యంలోనే మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవిని అరెస్టు చేయడం కలకలం రేపింది. ఎవరన్నా తప్పులు చేసినా, కేసులు ఉన్నా అరెస్టుచేయడంలో తప్పులేదు. చట్టానికి అందరూ సమానమే. అయితే పులివెందుల నుంచి కడపకు వస్తున్న బీటెక్ రవిని చాలా నెలల క్రితం నాటి కేసులో యోగివేమన యూనివర్శిటీకి సమీపంలో సినీఫక్కీలో వాహనాలు అడ్డుపెట్టి అదుపులోకి తీసుకున్నారు. ఆయన తలకు ముసుగు వేసి తలవద్ద గన్ పెట్టి మాట్లాడితే చంపుతామని బెదిరిస్తూ కడప చుట్టూ తిప్పడం కలకలం రేపింది. సీఐ అశోక్‌రెడ్డే తనను అరెస్టు చేశాడంటూ బీటెక్ రవి చెప్పుకొచ్చారు. చెప్పింది ఒప్పుకోకపోతే లేపేస్తామంటూ బెదిరించాడని, వారంతా పోలీసులు కాదని ఉత్తరాది రౌడీమూకలంటూ అప్పట్లో చెప్పారు. ఇక ప్రస్తుత అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ కూడా అశోక్‌రెడ్డి అరాచకాలు, బీటెక్ రవి అరెస్టుపై అప్పట్లో మాట్లాడారు. ఐదేళ్ల వ్యవధిలో అశోక్‌రెడ్డిలా ఒక పార్టీకి టార్గెట్ అయిన వ్యక్తి మరొకరు లేరంటారు. ఇప్పుడు ఆయన చేసిన అవినీతిపై టీడీపీ నేతలు టార్గెట్ చేశారు.

### రాజునా మజాకా

అశోక్‌రెడ్డి బ్యాచ్‌కు చెందిన మరో సీఐ రాజు వ్యవహారంపై కూడా పోలీసు శాఖలో చర్చ నడుస్తోంది. రాజు కూడా వైసీపీకి వీరభక్తుడంటారు. మున్సిపల్ ఎన్నికల సందర్భంగా రాజు రాయచోటిలో ఉన్నప్పుడు టీడీపీ నేతలు నామినేషన్ దాఖలు చేస్తే ఎన్నికల అధికారి కార్యాలయంలోనే వాటిని ఆయన చించేశారంటారు. నామినేషన్ పత్రాలను రాజు చించుతున్న దృశ్యాలను టీడీపీ నేతలు ఫోన్‌లో చిత్రీకరించారు. రాయచోటి మున్సిపల్ ఎన్నికల్లో రాజు వైసీపీకోసం 'బాగా' పనిచేయడంతో ఆయనను లక్కిరెడ్డిపల్లెకు తీసుకుపోగా అక్కడ నుంచి పులివెందులకు వచ్చారంటారు. వైసీపీ నేతలు ఏం చెప్పినా చేసేయడం రాజు నైజం. వీటినంతా ఆధారాలతో సహా టీడీపీ వారు ఫిర్యాదు చేశారు.

### పోలీసు స్థలం లీజుపై ఆశ్చర్యం

కడప నగరంలోని రాజారెడ్డివీధిలో పోలీసు పెట్రోలు బంకు వద్ద ఉన్న పోలీసు స్థలాన్నిడిప్యూటీ మేయర్ అనుచరులకు లీజుకు ఇవ్వడం వివాదాస్పదంగా మారింది. ఆ స్థలంపై వివాదం న్యాయస్థానంలో నడుస్తోంది. అయినా దానిని లీజుకు ఇచ్చారు. లీజుకు తీసుకున్న దానికంటే అదనంగా స్థలం ఆక్రమించి ఎలాంటి అనుమతులు లేకుండా కట్టడాలు కట్టారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ భాగోతాన్ని ఆంధ్రజ్యోతి ప్రచురించింది. పోలీసు స్థలం అడ్డగోలు లీజు విషయాన్ని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి రెండురోజుల క్రితం డీజీపీ ద్వారకా తిరుమలరావు దృష్టికి తీసుకెళ్లారు. తాము ఇలాంటి స్థలాలు లీజుకు ఇవ్వమని ఇది ఎలా జరిగిందంటూ డీజీపీ ఆశ్చర్యం వ్యక్తం చేసినట్లు చెబుతారు. దీనిపై కూడా ఇప్పుడు విచారణకు రానుంది. పోలీసుశాఖలోనే హాట్‌టాపిక్‌గా మారిన ఈ వ్యవహారాలపై ఆపరేషన్ పోలీస్ మొదలవడంతో పెద్ద చర్చ నడుస్తోంది.



డీజీపీకి వినతిపత్రం ఇస్తున్న శ్రీనివాసరెడ్డి

### గంజాయి మొక్కల ఏరివేత

కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి ఎన్నిలకు ముందు నియోజకవర్గంలో 8 నెలలపాటు వీధివీధినా, ఇంటింటికీ ఎన్నికల క్యాంపెయిన్‌కు వెళ్లారు. ఆమె వెళ్లిన చాలాచోట్ల గంజాయి, మహిళలపై వేధింపులు, భూకబ్జాలు ప్రధాన సమస్యలుగా ఎదురయ్యాయి. తాము అధికారంలోకి వస్తే కబ్జాలు లేని కడపను, గంజాయి లేని నగరాన్ని చేస్తామంటూ హామీ ఇచ్చారు. అందుకు తగ్గట్లుగానే ఆమె తనదైన స్టైల్‌లో వైసీపీ హయాంలో జరిగిన గంజాయి, భూకబ్జాలు ఇతరత్రా వాటిపై ఉక్కుపాదం మోపేందుకు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగానే ఆర్.శ్రీనివాసరెడ్డి పోలీసు శాఖలో ఉన్న గంజాయి మూకలను ఏరేసేందుకు డీజీపీకి ఫిర్యాదు చేయడం విశేషం.



లీజుతో వివాదాస్పదంగా మారిన పోలీసు స్థలం

# ఉసురు తీసిన.. సరదా..

కడపకు చెందిన వాళ్లంతా స్నేహితులు.. ఉదయం నుంచి తమ పనులతో గడిపి.. రాత్రి అందరూ ఒకచోట కలిశారు. పిచ్చాపాటి కబుర్లు చెప్పుకుంటున్న వాళ్లకు.. కారులో సరదాగా అలా బయటకు వెళ్లి సంతోషంగా గడపాలనే కోరిక పుట్టింది. అనుకున్నదే తడువుగా.. తమ స్నేహితుల్లో ఒకడైన డ్రైవర్ కారులో రాయచోటి మార్గంలో బయలుదేరారు. కడప నుంచి ఏవేవో.. కబుర్లు చెప్పుకుంటూ.. నవ్వుకుంటూ.. వచ్చి గువ్వలచెరువులో పాలకోవా తిన్నారు. అందరూ సంతోషంగా గడిపారు. ఇక అక్కడి నుంచి కడపకు వెళ్లకుండా.. రాయచోటిలో ఉన్న ఓ స్నేహితుడిని కలవాలని అనుకున్నారు. అయితే గువ్వలచెరువులో తిన్న పాలకోవా తీపి.. నాలుక మీది నుంచి ఇంకా పూర్తిగా కడుపులో దిగక ముందే.. మృత్యువు వాళ్లను కబళించింది. ఆయిల్ ట్యాంకర్ రూపంలో నలుగురి ప్రాణాలను నిర్ధాక్షిణ్యంగా గాలిలో కలిపేసింది. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు.

- స్నేహితుడి ఇంటికొస్తూ పరలోకాలకు..
- ట్యాంకర్‌ను ఢీకొన్న కారు..
- నలుగురు మృతి
- ఒకరికి తీవ్రగాయాలు
- మృతుల కుటుంబాలకు మంత్రి మండిపల్లె ఆర్థిక సాయం

సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



రామాపురం/రాయచోటి/కడప క్రైం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): రామాపురం మండలం చిట్లూరు పంచాయతీ హరిజనవాడ కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారి వంతెన సమీపంలో శుక్రవారం అర్ధరాత్రి సుమారు ఒంటిగంట సమయంలో ఎదురుగా వెళుతున్న స్పిరిట్ ట్యాంకర్‌ను కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందగా మరొకరు ఆసుపత్రికి తరలిస్తుండగా.. మృతి చెందారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. అందరిదీ కడప పట్టణం. మృతుల్లో.. కడప పట్టణం నాగరాజుపేటకు చెందిన అంజనేయులు నాయక్ (28) ఉన్నారు. ఇతను భాకరాపేట బెటాలియన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్నాడు. రాజారెడ్డివీధికి చెందిన అఫ్రోజ్‌ఖాన్ కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. నాగరాజుపేటకు చెందిన జితేంద్ర కుమార్ (24), అక్కాయపల్లెలోని శాస్త్రీనగర్‌కు చెందిన షేక్ అలీమ్ (35) ఉన్నారు. రవీంద్రనగర్‌కు చెందిన ఖాదర్‌బాష గాయాలతో బయటపడ్డాడు. అలీంకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అఫ్రోజ్‌ఖాన్‌కు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ప్రస్తుతం ఆతడి భార్య గర్భిణీగా ఉన్నారు. అంజనేయులునాయక్, జితేంద్రకు ఇంకా పెళ్లి కాలేదు. గాయపడ్డ ఖాదర్‌బాష కథనం మేరకు..స్నేహితులు అందరూ కడపలో కలిశారు. మద్యం తాగారు. అలా సరదాగా బయటకు వెళ్లి సంతోషంగా గడుపుదామని.. రాయచోటి వైపు బయలుదేరారు. గువ్వలచెరువులో కారు నిలిపి పాలకోవా తిన్నారు. అక్కడి నుంచి కడపకు వెళ్లాలనుకున్నారు.. అయితే వీళ్లలో ఎవరో రాయచోటిలో ఉన్న స్నేహితుడిని కలిసి వద్దామని అన్నారు. దీంతో రాయచోటికి వస్తుండగా.. చిట్లూరు పంచాయతీ హరిజనవాడ సమీపంలో ఉన్న వంతెన వద్ద ఎదురుగా వెళుతున్న స్పిరిట్ ట్యాంకర్‌ను వీళ్ల ప్రయాణిస్తున్న కారు వేగంగా ఢీకొంది. సంఘటనా స్థలంలో ముగ్గురు చనిపోయారు. జితేంద్ర ఆసుపత్రికి తరలిస్తుండగా..మార్గమధ్యలో చనిపోయారు. మృతదేహాలను రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అర్ధరాత్రి ప్రమాదం జరిగినా.. ఉదయం 6 గంటల వరకు మృతుల కుటుంబ సభ్యులకు తెలియదు. తర్వాత ఎవరో చెప్పడంతో మృతుల భార్య, పిల్లలు, ఇతర కుటుంబసభ్యులు ఆసుపత్రికి వద్దకు వచ్చి గుండెలు పగిలేలా రోదించారు. పనులకు వెళితే కానీ..కుటుంబాలు గడవవని.. ఇప్పుడు కుటుంబ పెద్ద మరణిస్తే.. జీవించేదెలా.. అంటూ.. రోదించడం అందరినీ కలచివేసింది. ప్రమాదంలో కారు పూర్తిగా నుజ్జునుజ్జయింది. సంఘటనా స్థలానికి లక్కిరెడ్డిపల్లె సీఐ గంగానాథ్‌బాబు, రామాపురం ఎస్ఐ ప్రసాద్‌రెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. విజయవాడ నుంచి వచ్చిన రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారకనాథరెడ్డిలు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ప్రమాద వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. రాయచోటి ప్రభుత్వాసుపత్రిలో మృతులకుటుంబ సభ్యులను పరామర్శించారు. తన తండ్రి మండిపల్లి నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్టు ద్వారా మృతులు ఒక్కొక్కరికీ రూ.25వేల చొప్పున ఆర్థికసాయం అందించారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి సాయం అందేలా కృషి చేస్తానని మృతుల కుటుంబాలకు హామీ ఇచ్చారు.



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నలుగురు

### వీడియోగ్రాఫర్‌గా పనిచేస్తూ..



కడప అక్కాయపల్లెలోని శాస్త్రినగర్‌కు చెందిన షేక్ అలీం (30) వీడియోగ్రాఫర్‌గా వీడియో ఎడిటర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. స్నేహితుడు కారు కొన్నాడని రాత్రి 9.30 గంటలకు ఇంటి నుంచి వెళ్లి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఇతడి భార్య షేక్ సబియా ఏడు నెలల గర్భిణి, ఇతడికి రెండు సంవత్సరాల కొడుకు కూడా ఉన్నాడు. ఇంటి పెద్ద మృతితో వారు శోకసంద్రంలో మునిగిపోయారు.


### మూడునెలల క్రితమే కువైత్ నుంచి వచ్చి..



అఫ్రోజ్‌ఖాన్

కడప నగరం రాజారెడ్డి వీధికి చెందిన పఠాన్ అఫ్రోజ్‌ఖాన్ మూడు నెలల క్రితం కువైత్ నుంచి స్వగ్రామానికి వచ్చాడు. కువైత్‌కు వెళ్లకుండా ఇక్కడే కారు తోలుకుని జీవనం సాగించవచ్చని భావించి ఇటీవల కారు కూడా కొనుగోలు చేశాడు. రాత్రి స్నేహితులతో కలిసి ఆ కారులోనే గువ్వలచెరువుకు వెళ్లి అక్కడి నుంచి రాయచోటికి వెళుతుండగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఇతడికి భార్య పఠాన్ తబస్సుమ్, ఐదు సంవత్సరాల కుమార్తె, రెండేళ్ల కొడుకుతో పాటు ప్రస్తుతం ఆమె గర్భవతి. ఇంటి పెద్దను కోల్పోవడంతో ఆ ఇంట్లో తీవ్ర విషాదం నెలకొంది.

### ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తూ..



జితేంద్ర

కడప నాగరాజుపేటకు చెందిన మరబత్తల జితేంద్ర (25) ప్రైవేటు హాస్పిటల్‌లో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవల తన కాలుకు దెబ్బ తగలడంతో మూడు నెలల నుంచి ఇంటి వద్ద ఉన్నాడు. స్నేహితుడు కారు కొన్నాడని శుక్రవారం ఇంటి నుంచి 8 గంటలకు బయటికి వెళ్లాడు. స్నేహితులతో కలిసి అదే కారులో ప్రయాణం చేస్తూ మృత్యుఒడిలోకి చేరుకున్నాడు. తండ్రి వెంకటరమణ కొరియర్ సర్వీసులో పనిచేస్తున్నాడు. ఇతడికి సోదరుడు కూడా ఉన్నాడు. ఇతడి మృతితో ఆ ఇంట్లో విషాదఛాయలు అలుముకున్నాయి.



ఆస్పత్రి వద్ద మృతుల కుటుంబీకుల రోదనలు



కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం మీడియాతో మాట్లాడుతున్న లోతేటి శివశంకర్

## అందరి సహకారంతో జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిస్తా

● నూతన కలెక్టర్ లోతేటి శివశంకర్

కడప(కలెక్టరేట్), జూలై 6: రాష్ట్ర ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా, ప్రజా ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలందరి సమన్వయ సహకారంతో జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని జిల్లా నూతన కలెక్టర్ లోతేటి శివశంకర్ పేర్కొన్నారు. శనివారం ఉదయం కలెక్టరేట్‌కు చేరుకున్న ఆయనకు జాయింట్ కలెక్టర్ గణేశ్‌కుమార్, నగర కమిషనర్ ప్రవీణ్‌చంద్, అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్ చాంబర్‌లో వేదపండితులు ఆశీర్వచనాలు అందించగా ఉదయం 11 గంటలకు కలెక్టర్‌గా లోతేటి శివశంకర్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరి సహకారంతో కలెక్టర్‌గా నిబద్ధతతో ఉద్యోగ ధర్మాన్ని నెరవేరుస్తూ జిల్లాను రాష్ట్రంలో ఆదర్శవంతంగా తీర్చి దిద్దుతానన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి పథకాలను ప్రజలకు సంతృప్తి స్థాయిలో అందేలా కృషి చేస్తానన్నారు. అనంతరం పలువురు జిల్లా అధికారులు, ప్రముఖులు, పాత్రికేయులు తదితరులు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికి కలెక్టర్‌కు అభినందనలు తెలిపారు. కాగా.. కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టడానికి ముందు ఆయన కుటుంబసమేతంగా ఒంటిమిట్ట కోదండరాముడిని దర్శించుకున్నారు.



ఒంటిమిట్ట కోదండరామున్ని దర్శించుకున్న కలెక్టర్ లోతేటి శివశంకర్

# ఇంకొక్కటి అడిగారు... వలకు చిక్కారు !

**ఎప్పుడూ ఒకశాతం తీసుకునేవారు.. రెండు కావాలన్నారు ● సీబీఐ వలలో పడిన అవినీతి చేపల కథ**

**డీఆర్ఎం సహా ఐదురుగు రైల్వే అధికారుల అరెస్టు ● లంచం ఇచ్చినందుకు ఇద్దరు కాంట్రాక్టర్లపైనా కేసు**

గుంతకల్లు, జూలై 6: ఎప్పుడూ ఒక శాతం కమీషన్(లంచం) తీసుకునేవారు..! ఈసారి మరోశాతం అదనంగా కావాలని అడిగారు. ఆ దురాశే వారిని ఊచలు లెక్కబెట్టేలా చేసింది. సీబీఐ వలకు చిక్కి పరువు బజారుకీడ్చింది. గుంతకల్లు రైల్వే డివిజన్ కేంద్రంలో తొలిసారి సీబీఐ దాడులు జరగడానికి ఇదే కారణం అంటున్నారు. డీఆర్ఎం కార్యాలయంలో ఓ శాఖాధికారిపై కాంట్రాక్టర్లు చేసిన ఫిర్యాదు అవినీతి వృక్షాలను పెకిలించింది. రైల్వే అకౌంట్స్ విభాగంలో అవినీతి బురద డీఆర్ఎం కార్యాలయానికి మాసిపోని మరకలను అంటించింది. తిరుపతిలో ఆరు నెలల కిందట జరిగిన సీబీఐ దాడులు మరువకనే అంతకుమించి అవినీతిని బయట పెట్టే దాడులు గుంతకల్లులో జరిగాయి. డీఆర్ఎం వినీత్ సింగ్, బదిలీపై వెళ్లిన సీనియర్ డీఈఎన్ (కో-ఆర్డినేషన్) యు.అక్కిరెడ్డి, సీనియర్ డీఎఫ్ఎం క్రెప్రదీప్ బాబు, అకౌంట్సు విభాగం సూపరింటెండెంటు బాలాజీ, గతిశక్తి చీఫ్ ప్రాజెక్టు మేనేజరు కార్యాలయ అకౌంట్సు అసిస్టెంటు డి.లక్ష్మీపతిరాజును సీబీఐ అరెస్టు చేసింది. వారిని కర్నూలు సీబీఐ కోర్టులో హాజరు పరచగా.. కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. లంచం ఇచ్చినందుకు ఇద్దరు కాంట్రాక్టర్లనూ సీబీఐ మూసేసింది. అంతా కర్నూలు జిల్లా జైలుకు శనివారం రాత్రికి చేరుకున్నారు. సీబీఐ దాడులు రైల్వే డివిజన్‌లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. అక్రమార్కుల గుండెలు హడలిపోతున్నాయి. మూడు రోజులుగా డీఆర్ఎం కార్యాలయంలో అధికారులు, సిబ్బంది బిక్కుబిక్కుమంటూ గడిపారు.

### ఇలా మొదలైంది..

గుంతకల్లు రైల్వే డివిజన్‌కు కేంద్రం ప్రభుత్వం నుంచి గతిశక్తి ప్రాజెక్టు కింద భారీగా నిధులు విడుదలయ్యాయి. సేఫ్టీ కేటగిరిలో వచ్చిన ఈ నిధులతో వంతెనలను నిర్మించాల్సి ఉంది. పీలేరుకు చెందిన సత్యనారాయణ ప్రధాన కాంట్రాక్టరుకు రూ.50 కోట్ల విలువైన బ్రిడ్జి వర్కులు దక్కాయి. ఆయన వంతెన పనులను సబ్ కాంట్రాక్టర్లకు ఇచ్చారు. పనులను ప్రాంభించడానికి అనుమతి పత్రం కోసం సబ్ కాంట్రాక్టర్లు రమేశ్ రెడ్డి, రఫ్మాతుల్లా అకౌంట్సు కార్యాలయం చుట్టూతిరిగారు. సీనియర్ డీఎఫ్ఎం ప్రదీప్ బాబుకు కొంత మొత్తం




సీబీఐ వలకు చిక్కిన అవినీతి అధికారులు

లంచంగా ఇచ్చారు. అయినా పనిచేయకుండా.. పెద్ద మొత్తంలో డిమాండు చేశారు. దీంతో సబ్ కాంట్రాక్టర్లు సీబీఐ అధికారులను ఆశ్రయించారు. సీబీఐ అధికారులు గుంతకల్లుకు వచ్చి.. నిఘా వేశారు. సీబీఐ డీఎస్పీ జైకుమార్ భారతీయ, ఆయన సిబ్బంది అవినీతి అధికారిని పట్టుకునేందుకు పథకం రచించారు. పథకం ప్రకారం సబ్ కాంట్రాక్టర్లు ఇచ్చిన రూ.11 లక్షల లంచం డబ్బును అకౌంట్సు సిబ్బంది తీసుకున్నారు. సీబీఐ అధికారులు వెంటనే వారిని అదుపులోకి తీసుకున్నారు. ఆ తర్వాత సీనియర్ డీఎఫ్ఎం ప్రదీప్ బాబును పట్టుకున్నారు. ఆ తరువాత వీడియో కాన్ఫరెన్సులో ఉన్న డీఆర్ఎం వినీత్ సింగ్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. డీఆర్ఎం, సీనియర్ డీఎఫ్ఎం ఇళ్లల్లో సోదా చేశారు. భారీగా బంగారు ఆభరణాలు, డబ్బు స్వాధీనం చేసుకున్నారు. ఇక్కడి నుంచి బదిలీపై వెళ్లిన సీనియర్ డీఈఎన్ (కో-ఆర్డినేషన్) యు.అక్కిరెడ్డికి కూడా ఈ అవినీతిలో భాగం ఉందని నిర్ధారించుకుని, అతడిని సికింద్రాబాదు నుంచి రప్పించి అరెస్టు చేశారు. వారిపై అవినీతి నిరోధక చట్టం 1988 ప్రకారం 61(2)-బీఎన్ఎస్, 7, 8, 9, 10, 12 సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. గతంలో లంచం ఇచ్చిన ఇద్దరు సబ్ కాంట్రాక్టర్లపై కూడా కేసులు నమోదు చేశారు. వీరందరికీ గుంతకల్లు ప్రభుత్వ ఆస్పత్రిలో శనివారం వైద్య పరీక్షలు చేయించి, కర్నూలు సీబీఐ కోర్టు ఎదుట హాజరు పరిచారు.

### వైసీపీ భక్తులు..

నెల కిందటి వరకూ గుంతకల్లు డివిజనల్ డీఈఎన్ (కో-ఆర్డినేషన్) హోదాలో పనిచేసిన అక్కిరెడ్డికి, సీనియర్ డీఎఫ్ఎం ప్రదీప్ బాబుకు వైసీపీ అంటే వల్లమాలిన అభిమానం. ఈ అవ్యాజమైన ప్రేమతో పలువురు కాంట్రాక్టర్లకు దక్కాల్సిన పనులను వైసీపీ అనుకూలురైన కాంట్రాక్టర్లకు వచ్చేలా ఉడతా సాయాలు చేసినట్లు సమాచారం. అధికారులమన్న ధ్యాస లేకుండా ఆ పార్టీకి కొమ్ముకాశారన్న ఆరోపణలున్నాయి. టెండర్లలోనే కాంట్రాక్టర్లు పోటీ పడకుండా అస్మదీయులకు అప్పగించినట్లు బలమైన ఆరోపణలున్నాయి. డివిజన్‌లోని పలువురు కాంట్రాక్టర్లకు వారి వ్యవహారం కంటగింపుగా మారినట్లు సమాచారం. ఆ అసంతృప్తే కాంట్రాక్టర్లలో ఇలా బైటపడిందని డీఆర్ఎం కార్యాలయంలో చర్చించుకుంటున్నారు. గుంతకల్లులోని ధర్మవరం గేటు వద్ద ఆర్‌యూబీ వంతెన నిర్మాణ శంకుస్థాపనకు మార్చిలో హాజరై స్టేజీ ఎక్కి మరీ వైసీపీ భజన చేశారు. వీరిలో ఒకరు ఎన్నికల తర్వాత జగన్మోహన్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేస్తారని, ఆ కార్యక్రమానికి హాజరు కావడానికి పాసు కూడా తెప్పించుకున్నట్లు తెలిసింది.

### రెండు శాతం డిమాండుతో..

కేంద్ర ప్రభుత్వం రైల్వే పనులకు సంబంధించి ఏ డివిజన్‌కు ఆ డివిజన్‌లో టెండర్లను నిర్వహించనీయకుండా, పలు వర్కులను కలిపి ఒకే పెద్ద వర్కుగా మార్చి అంబ్రెల్లా వర్కుల పేరిట బిడ్లను ఆహ్వానిస్తోంది. ఈ పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్లు.. స్థానిక అధికారులకు ఒక శాతానికి మించకుండా మామూళ్లు ఇస్తుంటారు. కానీ కడప వద్ద సబ్ కాంట్రాక్టర్లు చేసేందుకు సిద్ధపడిన వంతెనల వర్కులపై 2 శాతం మమూలు ఇవ్వాలని డిమాండు చేశారని సమాచారం. అందుకే వ్యవహారం తెగేదాకా వచ్చిందని అంటున్నారు. రైల్వే డివిజన్‌లోని తిరుపతిలో ఇద్దరు ఉద్యోగులు ఫిబ్రవరిలో సీబీఐ చేతికి చిక్కారు. ఎలెక్ట్రికల్ ఎస్ఎస్ఈగా పని చేస్తున్న గంటా రామమోహనరావు, ఏడీఈఈగా పనిచేస్తున్న అప్పలరాజు, మెసర్స్ కోర్ ఫోర్ ఇంజనీరింగ్ కంపెనీ నుంచి రూ.60 వేలు లంచం తీసుకుంటుండగా సీబీఐ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుంది. తిరుపతిలోని కోచ్ వాషింగ్ అండ్ సిక్ మెయింటెనెన్స్ డిపోలో బోగీలకు 750 ఓల్టు విద్యుత్తు సరఫరా కాంట్రాక్టు విషయమై లంచం తీసుకుంటూ వారు దొరికారు. అది జరిగి ఆరు నెలలు తిరక్కుండానే డివిజనల్ హెడ్ క్వార్టర్లులోనే అవినీతి చేపలు సీబీఐ వలకు చిక్కాయి.

## మృతుల కుటుంబాలను ఆదుకుంటాం

**రవాణా, యువజన, క్రీడల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి**



విలేకర్లతో మాట్లాడుతున్న మంత్రి మండిపల్లి

రాయచోటిటౌన్, జూలై6: రామాపురం మండలం కొండావాండ్లపల్లె వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో మృతుల కుటుంబాలను ఆదుకుంటామని రవాణా, యువజన, క్రీడలశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన రోడ్డు ప్రమాద సంఘటనను పరిశీలించి జరిగిన ప్రమాదంపై బాధితుల కుటుంబాలను, అధికారులను, పోలీసులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రాయచోటి ఏరియా ఆస్పత్రికి చేరుకుని రోడ్డు ప్రమాదంలో నాలుగు మృతదేహాలను సందర్శించి వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. తక్షణ సాయం కింద మండిపల్లి నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్టు ద్వారా ఒక్కొక్క కుటుంబానికి రూ.25 వేలు చొప్పున లక్ష రూపాయలు ఆర్థిక సహాయాన్ని మంత్రి అందజేశారు. అనంతరం మీడియాతో మట్లాడుతూ రోడ్డు ప్రమాదంలో నలుగురు దుర్మరణం చెందడం బాధాకరమన్నారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం నుంచి రావాల్సిన సహాయాన్ని అందించేందుకు తన వంతు కృషి చేస్తానని బాధిత కుటుంబాలకు హామీ ఇచ్చారు.

## దాడి కేసులో నలుగురు నిందితుల అరెస్టు



నిందితులతో సీఐ చాంద్‌బాష, ఎస్ఐ ప్రవీణ్

వేంపల్లె, జూలై 6: వేంపల్లెలో అజయ్‌కుమార్ రెడ్డిపై జరిగిన దాడి కేసులో నలుగురు నిందితులను శనివారం అరెస్టు చేశామని సీఐ చాంద్‌బాష తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఐ విలేకరులకు వివరాలు వెల్లడించారు. శాసన మండలి మాజీ డిప్యూటీ ఛైర్మన్ సతీష్ రెడ్డి అనుచరుడు, వైసీపీ కార్యకర్త అజయ్‌కుమార్‌రెడ్డిపై శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తులు దాడిచేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. పదిమందికి పైగా హత్యాయత్నం కేసు నమోదు చేశారు. నిందితుల కోసం గాలించగా సింహాద్రిపురం వాసి గండూరు హిదయతుల్లా, కోవరంగుట్టపల్లెకు చెందిన మల్లెల మహేశ్వరరెడ్డి, వేముల మండలం నల్లచెరువుపల్లె వాసులు రామిరెడ్డి ధరణీశ్వర్‌రెడ్డి, కొండాపురం మండలం డొంకుపల్లెకు చెందిన పందిళ్ల శివకుమార్‌రెడ్డిని గుర్తించి అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. టీడీపీ మండల పరిశీలకులు రఘునాథరెడ్డి, టీడీపీ నేతలు రవితేజారెడ్డిని గతంలో తిట్టాడని, అసభ్యకరంగా పోస్టులు పెట్టారనే కారణంగా అజయ్‌కుమార్‌రెడ్డిపై దాడి చేసినట్లు నిందితులు అంగీకరించారన్నారు. కోర్టులో హాజరుపర్చగా మెజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించగా కడప జైలుకు తరలించారు. ఎస్ఐ ప్రవీణ్‌కుమార్,సిబ్బంది పాల్గొన్నారు.

## రేబిస్ టీకాలను తప్పక వేయించాలి

**● జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి శారదమ్మ**

కడప(రూరల్) జూలై 2: పెంపుడు కుక్కలకు రేబిస్ టీకాలను తప్పనిసరిగా వేయించాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి శారదమ్మ తెలిపారు. ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా శనివారం కడప నగరంలోని బహుళార్థ పశువైద్యశాల(వీపీసీ)లో పెంపుడు కుక్కలకు పిచ్చి ఎక్కకుండా ఉచితంగా రేబిస్ టీకాలు వేశారు. జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి శారదమ్మ మాట్లాడుతూ కుక్కలకు రేబిస్ వచ్చిన తరువాత వైద్యం లేదనందున పెంపుడు కుక్కల యజమానులు ముందుగానే కుక్కలకు టీకాలు వేయించుకుని పెంపుడు జంతువులను కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో వీపీసీ ఉపసంచాలకులు డాక్టర్ కె. రంగస్వామి, ఏడీడీఎల్ రాజశేఖర్, డాక్టర్ సంధ్య, ఎల్ఎస్ఏ షాహిదాబేగం, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## డబ్బు ఇవ్వకపోతే చంపుతామని బెదిరించారు

**● బాధితుడి ఆవేదన**



వివరాలు వెల్లడిస్తున్న బాధితుడు ఓబులేసు

జమ్మలమడుగు, జూలై 6: డబ్బు వెంటనే చెల్లించకపోతే చంపుతామని బెదిరించినట్లు ప్రభుత్వ ఆస్పత్రిలో బాధితుడు కాకి ఓబులేసు వివరించారు. ప్రొద్దుటూరు మండలం చౌడూరు వాసి ఓబులేసు కొలిమిగుండ్ల మండలం తిమ్మనాయునిపేటలో వివాహం చేసుకున్నాడు. అత్తగారింటికి వెళ్లి మూడు రోజులు ఉండి అక్కడి నుంచి ఉదయాన్నే జమ్మలమడుగు మీదుగా ప్రొద్దుటూరుకు స్కూటర్‌లో బయల్దేరాడు. బాధితుడు ఎక్స్‌కవేటర్ డ్రైవర్. దేవగుడి గ్రామం బైపాస్ రోడ్డు వద్ద ఇద్దరు వ్యక్తులు దారి కాచి ద్విచక్ర వాహనంలో వెంటపడి కత్తితో దాడి చేసినట్లు తెలిపారు. ఈ ఘటనలో ఓబులేసుకు తల వద్ద, చేతికి, నడుము వద్ద రక్తగాయమైంది. వెంటనే దేవగుడి గ్రామానికి చెందిన కొందరు బాధితుడిని జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి చేర్చారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తాను ప్రొద్దుటూరులోని శ్రీనివాసులరెడ్డి, సుబ్బారెడ్డి ఎక్స్‌కవేటర్ ఓనర్లకు డబ్బు బాకీ ఉన్నట్లు తెలిపారు. తనపై దాడికి వచ్చినవారు గుర్తు తెలియని వారు అని, బాకీ డబ్బు వెంటనే చెల్లించకపోతే ఇది మొదటిసారి అని, రెండో సారి వస్తే ఏకంగా చంపుతామని బెదిరించినట్లు బాధితుడు ఆరోపించారు. సమాచారాన్ని జమ్మలమడుగు అర్బన్ పోలీసులకు, ఆస్పత్రి సిబ్బంది తెలిపారు. బాధితుడు తనపై దాడికి సంబంధించి అర్బన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తానని తెలిపాడు.

## రూ.17 లక్షల ఎరువులు సీజ్

పుల్లంపేట, జూలై 6: మండలంలో వ్యవసాయశాఖ సహాయ వ్యవసాయ సంచాలకులు సాయిరెడ్డి ఆధ్వర్యంలో విజిలెన్స్ అధికారులు శనివారం ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీలో ఎరువుల దుకాణాల్లో అక్రమంగా నిల్వ ఉంచిన ఎరువులపై 17 లక్షలు విలువైన 84.29 టన్నుల ఎరువులను సీజ్ చేశారు. ఈ తనిఖీలో విజిలెన్స్ అధికారి రామక్రిష్ణనాయక్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థి అదృశ్యం



చాపాడు, జూలై 6: గుంతచీపాడు వాసులు నీలపాల గంగయ్య, నాగలక్ష్మి కుమారుడు విద్యార్థి నీలపాల గణేష్ అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. గణేష్ మైదుకూరులోని మాంటిస్సోరీ పాఠశాలలో టెన్త్ చదువుతున్నాడు. ఈనెల 4వ తేదీ గురువారం రాత్రి ఇంటి పైన గణేష్, అతని తమ్ముడు హర్షవర్ధన్ నిద్రించినట్లు తెలిపారు. తెల్లవారేసరికి గణేష్ కనిపించలేదన్నారు. గణేష్ పుస్తకాలు, బ్యాగు, రెండు జతల దుస్తు లు తీసుకెళ్లినట్లు తెలిపారు. ఇంట్లో నాగలక్ష్మి, ఆమె తండ్రి కూడా నిద్రించినట్లు తెలిపారు. గంగయ్య గల్ఫ్‌దేశాల్లో ఉన్నాడు. నాగలక్ష్మి ఫిరాద్యు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## విద్యుత్ తీగలు తగిలి టిప్పరు దగ్ధం



బి.కోడూరు, జూలై 6: టమటంవారిపల్లె సమీ పాన నేషనల్ హైవేకు గ్రావెల్ తోలుతున్న టిప్పరు విద్యుత్ తీగలు తగిలి దగ్ధం కాగా ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. అందులో ఉన్న డ్రైవరు కిందికి దూకడంతో టిప్పరు మాత్రమే పూర్తిగా కాలిపోయింది. పోరుమామిళ్ల అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు ఆర్పారు. నేషనల్ హైవే పనులు మెగా కంపె నీ వారు చేపడుతున్నారు. గ్రావెల్ తోలేందుకు జయశ్రీ కంపెనీకి ఇచ్చారు. వారు తువ్వపల్లె చెరువు నుంచి గ్రావెల్ తోలుతుండగా ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు.

## సుప్రీంకోర్టు కేసులపై ప్రత్యేక లోక్ అదాలత్

కడప(రూరల్), జూలై 6: సుప్రీంకోర్టులో పెండింగ్ ఉన్న కేసుల పరిష్కారం కోసం శనివారం జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవాసదన్‌లో ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎల్ఎస్ఏ చైర్‌పర్సన్, జిల్లా ప్రధాన జడ్జి జి.శ్రీదేవి మాట్లాడుతూ పెండింగ్ కేసుల పరిష్కారం కోసమే ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమాన్ని కక్షిదారులు, న్యాయవాదులు సద్వినియోగం చేసుకోవడం అభినందనీయమన్నారు. ప్రత్యేక లోక్అదాలత్‌కు శాశ్వత లోక్ అదాలత్, పబ్లిక్ యుటిలటీ సేవల చైర్మన్ స్వర్ణ ప్రసాద్, డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబావక్రుద్దీన్ ప్రిసైడింగ్ అధికారులుగా వ్యవహరించారు.

### హెల్మెట్ ప్రాముఖ్యతపై ర్యాలీ

జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో హెల్మెట్ ప్రాముఖ్యతపై శనివారం కడప నగరంలో ర్యాలీ నిర్వహించి వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వన్‌టౌన్ సీఐ భాష్కర్‌రెడ్డి, కోర్టు కానిస్టేబుళ్లు మహేష్, కిరణ్, ఇతర కానిస్టిబేల్స్, పారాలీగల్ వలంటీర్లు పాల్గొన్నారు. అలాగే జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవా సదన్‌లో హెల్మెట్ ప్రాముఖ్యతపై న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించారు.

## వైవీయూ బీఎడ్, ఎంఎడ్ పరీక్షల తనిఖీ



బీఎడ్, ఎంఎడ్ పరీక్షలను తనిఖీ చేస్తున్న రిజిస్ట్రారు రఘునాథరెడ్డి

కడప (ఎడ్యుకేషన్), జూలై 6: వైవీయూ అనుబంధ కళాశాలలో జరుగుతున్న బీఎడ్, ఎంఎడ్ 2, 4 సెమిస్టరు పరీక్షలను వైవీయూ రిజిస్ట్రార్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రఘునాథరెడ్డి తనిఖీ చేశారు. శనివారం కడప నగరం బీఎడ్ కళాశాల రాయచోటి శివారులో ఉన్న భరత్ బీఎడ్ కళాశాల కేంద్రాన్ని తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రంలో సౌకర్యాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. కేంద్ర అబ్జర్వర్లు పరీక్షలను కేంద్రంలో ఉండి పర్యవేక్షించగా యూనివర్శిటీ ఫైవర్ కమిటీ బృందాలు అన్ని కేంద్రాలు తనిఖీ చేశారు. జిల్లాలోని 15 కేంద్రాల్లో 3143 విద్యార్థులు పరీక్షలు రాస్తున్నట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసరు ఎన్.ఈశ్వర్‌రెడ్డి తెలిపారు.

## భూవివాదంపై ఘర్షణ

**● పలువురికి గాయాలు**

బ్రహ్మంగారిమఠం, జూలై 6: బాగాదిపల్లెలో శనివారం సాయంత్రం పడిగెపాటి పుల్లారెడ్డి, కంచం రెడ్డి నారాయణరెడ్డి కుటుంబీకులు, మరికొందరు భూవివాదంపై ఘర్షణ పడ్డారు. ఇందులో పలువురు గాయాలపాలయ్యాయి. ప్రజల వివరాల మేరకు.. 15 ఏళ్లగా ఒకే కుటుంబానికి చెందిన భూమి మరొకరు సాగు చేసుకుంటుండేవారు. కుటుంబ సభ్యులు కావడంతో అందరికీ సమంగా భూమి కావాలని శనివారం భూమిని దున్నుతున్న పడిగెపాటి పుల్లారెడ్డి, వారి కుటుంబ సభ్యులను కంచెంరెడ్డి నారాయణరెడ్డి అడ్డుకోగా ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంది. ఇందులో పలువురికి గాయాలపాలయ్యారు. క్షతగాత్రులను అంబులెన్స్ సాయంతో ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ప్రజలు తెలిపారు. ఎస్ఐ విద్యాసాగర్‌ను వివరణ అడగ్గా, ఇంత వరకు మాకు సమాచారం లేదని, సమాచారం వస్తే కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని తెలిపారు.

## అగ్నివీర్ వాయు పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

కడప (మారుతీనగర్) జూలై 6: అగ్నివీర్ పథకంలో భాగంగా ఇండియన్ ఎయిర్ ఫోర్స్ (అగ్నివీర్ వాయు) ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఉపాధి అధికారి ఎ.సురేష్‌కుమార్ తెలిపారు. ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో పనిచేసేందుకు కనీసం 50 శాతం మార్కులతో మ్యాథమెటిక్స్, ఫిజిక్స్ ఇంగ్లీషు, సబ్జెక్టులతో ఇంటర్‌మీడియేట్ (10+2) తత్సమాన ఉత్తీర్ణత కలిగి వుండాలన్నారు. ఆన్‌లైన్‌లో agnipathvayu.cdac.in లింక్ ద్వారా ఈనెల 8 నుంచి 28లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. కావున జిల్లాలోని ఔత్సాహిక యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## వాహనం ఢీ - మహిళకు గాయాలు



లక్కిరెడ్డిపల్లె జూలై6: నిత్యావసర సరుకుల గోదాము వద్ద గుర్తుతెలియని వాహనం మతిస్థిమితంలేని గులాబ్‌జాని ఢీకొంది. దీంతో ఆమెకు గాయాలయ్యాయి. మతిస్థిమితంలేని మహిళ లక్కిరెడ్డిపల్లెలో ఆకలి తీర్చుకునేందుకు తిరుగుతూ ఉంటుంది గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో స్థానికులు గమనించి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. పరిస్థితి విషమించడంతో కడప రిమ్స్‌కు తరలించారు. వాహనాన్ని సీసీ కెమెరాలు ద్వారా గమినించి పట్టుకుంటామని పోలీసులు తెలిపారు

## తెగి పడిన విద్యుత్ లైన్లను సరిచేయాలి

**జిల్లా విద్యుత్ శాఖ అధికారి రమణ**



ఫక్కీరుపల్లె సబ్‌స్టేషన్ ట్రాన్స్‌ఫార్మర్ల లైన్లను చెక్ చేస్తున్న రమణ

కడప (నాగరాజుపేట), జూలై 6: ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు తెగిపడిన విద్యుత్ తీగలను సకాలంలో సిబ్బంది స్పందించి సరిచేయాలని జిల్లా విద్యుత్ శాఖ అధికారి సూపరింటెండెంట్ ఇంజనీర్ రమణ తెలిపారు. కడపలోని 33/11 కేవీ పక్కీరుపల్లె సబ్‌స్టేషన్ తదితర ప్రాంతాల్లోని ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు. అనంతరం కడపలో సిబ్బంది, అధికారులతో సమావేశమైన ఆయన విద్యుత్ పనుల్లో భద్రతా నియమాలు విధిగా పాటించాలని ఆదేశించారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల లైన్లలో జరిగే సమస్యలను గుర్తించి ముందస్తు మరమ్మత్తులు చేసి అంతరాయాలను అరికట్టాలన్నారు. లో ఓల్టేజీ సమస్యలు తలెత్తకుండా అవసరమైనన్ని కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. లూజు లైన్లను ఎప్పటికప్పుడు సరిచేయాలని ఆదేశించారు. తక్కువ ఎత్తులో ఉన్న లైన్లను గుర్తించి యుద్ధప్రాతికదిన తగు చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాకాలం దృష్టిలో ఉంచుకుని విద్యుత్ ప్రమాదాల పట్ల ప్రజలను అప్రమత్తంగా ఉంచడంలో భాగంగా విద్యుత్ స్తంభాలను తాకకుండా, తెగిపడిన విద్యుత్ వైర్లను తాకకుండా మరమ్మత్తులు చేయించుకోవాలన్నారు. విద్యుత్ బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఈ పర్యటనలో కడప డీఈఈ నాయక్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు హరిక్రిష్ణ, రామక్రిష్ణ, షకీల్ అహ్మద్, జూనియర్ ఇంజనీర్లు మరియు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పోటా పోటీగా కబ్జా యత్నాలు



మోడల్ స్కూల్ ఎదుట భూమిని చదును చేస్తున్న దృశ్యం

బి.కొత్తకోట, జూలై6: అనేక పోరాటాల ఫలితంగా కార్మికుల కోసం కేటాయించిన ఇళ్ల స్థలాల్లో మిగులు స్థలాన్ని పలువురు కబ్జా చేసేందుకు పోటీ పడుతున్నారు. ఇందులో రెండువర్గాల మధ్య ఆధిపత్యపోరు నడుస్తోంది. తాజాగా శుక్రవారం ఓ వర్గం ఎక్స్‌కవేటర్‌తో చదును చేయగా, శనివారం మరో వర్గం పునాదులు వేసింది. వివరాల్లోకెళితే...

బి.కొత్తకోటలో ప్రభుత్వభూమి కబ్జాలు, నకిలీపట్టాలు, అధికారులపై అజమాయిషీ నిత్యకృత్యంగా మారింది. నిలువ నీడలేని పేదలు జానెడు ఇంటిజాగా కోసం వెంపర్లాడితే అర్థం వుంది కానీ, రాజకీయ, సామాజికం, ఆర్థికంగా అన్ని రకాలుగా స్తోమత వుండి కూడా తామేదో పేదోళ్ల అన్నట్లు కలరింగ్ ఇచ్చి ప్రభుత్వ భూమి కాజేసేయత్నం చేయడం పట్టణ ప్రజలకు విస్మయం కలిగిస్తోంది. నగరపంచాయతీ పరిధిలో స్థలం సునాయాసంగా కొట్టేయాలన్నా, కబ్జా చేయాలన్నా, అందరికీ గుర్తు వచ్చేది పెయింటర్స్ కాలనీ. ఎప్పుడో బి.కొత్తకోట మండలం మదనపల్లె నియోజకవర్గంలో భాగంగా వున్నప్పుడు సీపీఐ నేతల పోరాట ఫలితంగా పట్టణశివారు బీరంగి పంచాయతీ సర్వేనంబరు 58-2లో ఏర్పడిన ఈ పెయింటర్స్ కాలనీలో కార్మికుల కోసం ఇళ్లస్థలాలను కేటాయించారు. పోగా మిగిలిన స్థలం రిజర్వులో వుంచారు. కమ్యూనిటీ పర్పస్ కింద మరికొంత స్థలాన్ని కేటాయించారు. కాలక్రమేణా రిజర్వు స్థలం కబ్జాకు గురవుతూ వచ్చింది. కమ్యూనిటీ స్థలం మాత్రం మిగిలింది. ఎన్నికలకు మునుపు ఇక్కడి తహసీల్దార్ బలహీనతలను ఆసరాగా చేసుకుని ఈ భూమిపై కొందరు కన్నేశారు. నయానో భయానో తాము ఆ ప్రదేశంలో వుంటున్నట్లు పొసెషన్ సర్టిఫికెట్లు తీసేసుకున్నారు. ఈ స్థలం అత్యంత విలువైనది కావడంతో మరికొందరు సైతం తమ ప్రయత్నాలతో మాన్యువల్‌గా పట్టాలు పొందారు. ఆ అధికారి వెళ్లిపోయారు. ప్రస్తుతం ఆ రెండువర్గాల మధ్య ఆధిపత్యపోరు నడుస్తోంది. కమ్యూనిటీ స్థలం మాదంటే... మాదంటూ ఆధిపత్య పోరుకు దిగారు. ఒకే ప్లాటుకు రెండేసి పట్టాలు వుడడంతో ఓ వర్గం చదును చేయిస్తే, మరో వర్గం పునాదులు తవ్వుతోంది. ఒకరు అధికారాన్ని అడ్డుపెడుతుంటే... మరొకరు ఏకంగా హైకోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నారు. సమస్య పోలీసు, రెవెన్యూ అధికారుల దృష్టికి వెళ్లిడంతో మండలంలో చర్చనీయాంశమైంది. కోర్టు ఆదేశాలతో అధికారులు జోక్యం చేసుకునేందుకు వెనుకంజ వేస్తున్నారు. మరోవైపు ఈ స్థలాన్ని కొట్టేయాలని చూస్తున్న వారిలో ఒక్కరూ అర్హులు కాదని, రాజకీయ, సామాజిక పలుకుబడితో కబ్జాకు యత్నిస్తున్నారని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు.

## వాహనదారులూ... హెల్మెట్ తప్పనిసరి


● వన్‌టౌన్ సీఐ భాస్కర్‌రెడ్డి



ర్యాలీలో మాట్లాడుతున్న సీఐ భాస్కర్‌రెడ్డి

కడప (క్రైం), జూలై 6 : ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనాలు డ్రైవింగ్ చేయాలని కడప వన్‌టౌన్ సీఐ భాస్కర్‌రెడ్డి సూచించారు. జిల్లా లీగల్ సెల్ అథారిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం రోడ్డు ప్రమాదాలు ఎక్కువ జరుగుతున్నాయని ట్రాఫిక్ నియంత్రణపై అవగాహన లేకపోవడం అతివేగం కారణంగానే అంద రూ ప్రాణాలకు కోల్పోతున్నారని అన్నారు. హెల్మెట్ వాహనదారునికి రక్షణగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వన్‌టౌన్ సిబ్బంది, లీగల్ సెల్ అథారిటీ సభ్యులు పాల్గొన్నారు.

## గుర్తింపు లేని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి: ఎస్ఎఫ్ఐ


వినతిపత్రం అందిస్తున్న నాయకులు

కడప (ఎర్రముక్కపల్లె), జూలై 6 :జిల్లాలో అనుమతి లేకుండా కొనసాగుతున్న ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రవి, సహాయ కార్యదర్శి శేఖర్ డిమాండ్ చేశారు. శనివారం డీఈఓ కార్యాలయం ఏడీ మునీర్‌ఖాన్‌కు వారు వినతి పత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ జిల్లాలో కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థలు విద్యను వ్యాపారం చేస్తున్నాయన్నారు. దీనిపై వెంటనే విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని, లేకుంటే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

### పండ్ల తోటల సాగుకు దరఖాస్తు చేసుకోండి

సింహాద్రిపురం, జూలై 6: మండలంలో కొత్తగా పండ్ల తోటలు సాగు చేసే రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఉపాధి హామీ పథకం ఏపీఓ జయభారతి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఐదు ఎకరాలు లోపు భూమి కలిగిన అన్ని గ్రామాల రైతులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులన్నారు. చీనీ, నిమ్మ, డ్రాగన్ ఫ్రూట్స్, జామ, మామిడి, పనస లాంటి పండ్ల తోటలు సాగు చేసే రైతులకు ఉపాధి హామీ పథకం నుంచి ప్రోత్సాహం ఇస్తామన్నారు. అదేవిధంగా పశువులు వున్న రైతులు నీటి వసతి కలిగిన వారు పచ్చిగడ్డి పెంపకానికి దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని మండల రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## రేపు సర్వసభ్య సమావేశం

సీకేదిన్నె, జూలై 6: చింతకొమ్మదిన్నె మండల సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహిస్తున్నట్లు మండల అభివృద్ధి అధికారిణి షకీలాబేగం తెలిపారు. మండల సర్వసభ్య సమావేశానికి ఆయా శాఖల అధికారులు నివేదికలతో రావాల్సిందిగా తెలిపారు. మండల అభివృద్ధిని ప్రణాళికాబద్ధంగా ముందుకు నడిపించేందుకు గతంలో తీసుకున్న అజెండాలో పొందుపరిచిన అంశాలను, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రణాళికతో సిద్ధంగా రావాలని, ప్రజాప్రతినిధులు, అధికారులు సోమవారం ఉదయం 11గంటలకు హాజరుకావాలని కోరారు.

### పచ్చదనం - పరిశుభ్రతతోనే ఆరోగ్యం


కంపచెట్లను తొలగిస్తున్న సర్పంచు గంగిరెడ్డి

పెండ్లిమర్రి, జూలై 6: పచ్చనం పరిశుభ్రతతోనే ఆరోగ్యం అని సర్పంచుగంగిరెడ్డి తెలిపారు. మండలంలోని చెర్లోపల్లె గ్రామ పంచాయతీ పగడాలపల్లె, చెర్లోపల్లె గ్రామాలలో శనివారం కంపచెట్లను జేసీబీ సహాయంతో తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న వర్షాకాలం దృష్టిలో పెట్టుకొని రోడ్లు, వీధులలో కంపచెట్లను తొలగించి, గుంతలు పూడ్చడం జరిగిందని తెలిపారు. అలాగే సచివాలయం సిబ్బంది కూడా అప్రమత్తంగా ఉండాలని కోరారు.

### హౌసింగ్ లేఅవుట్ భద్రతను పెంచండి

● అధికారులకు సూచించిన పీడీ కృష్ణయ్య


పులివెందుల జగనన్న హౌసింగ్‌లేఅవుట్‌లో ఇసుక డంప్‌ను పరిశీలిస్తున్న పీడీ కృష్ణయ్య

పులివెందుల రూరల్, జూలై 6: పులివెందుల జగనన్న హౌసింగ్ లేఅవుట్‌లో సామాగ్రి దొంగతనం కాకుండా భద్రతను పెంచాలని హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ కృష్ణయ్య అధికారులకు సూచించారు. శనివారం ఇళ్ల నిర్మాణానికి ఉపయోగించే సిమెంటు, స్టీలు, ఇసుక తదితర సామగ్రిని పరిశీలించారు. అలాగే భద్రత విషయంలో మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డికి లేఖ ద్వారా వివరించినట్లు తెలిపారు. ఈఈ రాజారత్నం, ఏఈలు సంజీవరాయుడు, ప్రమోద్‌కుమార్‌పాల్గొన్నారు.

# నూతన కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపిన ఉన్నతాధికారులు






కడప (ఎర్రముక్కపల్లె), జూలై6: కడప జిల్లా నూతన కలెక్టర్ లోతేటి శివశంకర్‌కు శనివారం జిల్లా ఉన్నతాధి కారులు స్వాగతం పలికారు. జేసీ గణేష్, కార్పొరేషన్ కమిషనర్ ప్రవీణ్‌చంద్, డీఆర్వో గంగాధర్‌గౌడ్, వైవీయూ ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్, రఘునాథరెడ్డి కలెక్టర్‌కు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.

**జిల్లాను అభివృద్ధిపథంలో నడిపించండి**

కడప (మారుతీనగర్), జూలై 6: జిల్లాను అభివృద్ధి పథంలో పయనింపజేయాలని నూతన కలెక్టర్ శివశంకర్‌ను సంఘసేవకుడు సలావుద్దీన్ ఆకాంక్షించారు. శనివారం కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన శివశంకర్‌ను కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో కలిసి శాలువా, పుష్పగుచ్ఛంతో సత్కరించారు. ప్రధానంగా కడప నియోజకవర్గంలో అత్యధిక సంఖ్యలో ముస్లింలు ఉన్నారని, అభివృద్ధికి చొరవ చూపాలన్నారు.

**గౌతమబుద్ధుని చిత్రపటం బహూకరణ**

కడప (నాగరాజుపేట), జూలై 6 : బహుజన సంక్షేమ సమితి రాష్ట్ర యువజన అధ్యక్షుడు ఇరగదిండ్ల హరీష్‌కుమార్ కలెక్టర్ శివశంకర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. గౌతమబుద్ధుని చిత్రపటాన్ని బహూకరించి శాలువాతో సత్కరించారు. ఎస్సీ, ఎస్టీ బీసీ మైనార్టీ అభ్యున్నతికి కృషి చేయాలని కలెక్టరుకు విన్నవించామని తెలిపారు. జిల్లాలో బహుజనుల సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని విన్నవించామన్నారు.

**కలెక్టర్‌ను సత్కరించిన టీడీపీ నేత కుప్పాల**

సిద్దవటం, జూలై 6 : నూతన కలెక్టర్ శివశంకర్‌ను టీడీపీ నేత కుప్పాల వెంకటసుబ్బయ్య మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి సత్కరించారు. అనంతరం సిద్దవటం మం డలంలో ఉన్న పుణ్యక్షేత్రాలు, మట్లి రాజులు పరిపాలించిన కోట విశిష్టతను ఆయనకు తెలి యజేశామని ఆయన పేర్కొన్నారు.

# బాబు జగ్జీవన్‌రామ్ గొప్ప పరిపాలనాదక్షుడు




వేంపల్లెలో బాబు జగ్జీవన్‌రామ్‌కు నివాళులు అర్పిస్తున్న తులసిరెడ్డి... కడప: జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఎంఈఎఫ్ నివాళి... పూలమాల వేస్తున్న కైపు రామాంజనేయులు

వేంపల్లె, జూలై 6: స్వాతంత్ర్య సమరయోధుడు, భారత మాజీ ఉప ప్రధాని స్వర్గీయ బాబూ జగ్జీవన్ రామ్ గొప్ప పరిపాలనా దక్షుడని మాజీ రాజ్యసభ సభ్యులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు తులసిరెడ్డి అన్నారు. వేంపల్లెలో శనివారం జగ్జీవన్ రామ్ 38వ వర్ధంతిని కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ అసలైన గాంధేయవాది, సమవాది అన్నారు. బీహార్‌లోని ససారా లోక్‌సభ స్థానం నుంచి 40ఏళ్ల పాటు ఏకధాటిగా ప్రాతినిథ్యం వహించి ప్రపంచ రికార్డు నెలకొల్పారన్నారు. ఒటమి ఎరుగని రాజకీయనాయకుడు అన్నారు. 30ఏళ్ల పాటుకేంద్రమంత్రిగా జాతీయ రికార్డు నెలకొల్పాడన్నారు.

వ్యవసాయశాఖ మంత్రిగా హరిత విప్లవానికి శ్రీకారం చుట్టి ఆకలి చావుల నుంచి దేశాన్ని రక్షించారు, రక్షణశాఖ మంత్రిగా 1971 భారత్-పాక్ యుద్ధంలో భారతసైన్యాన్ని విజయపథాన నడిపిని కార్యశూరుడు అన్నారు. బాబు జగ్జీవన్ రామ్ జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శం, అనుసరణీయమన్నారు.ఉత్తన్న, బాలం సుబ్బరాయుడు, ఆరుశేర్ల సుబ్బరాయుడు, మహబూబ్ బాష (మాస్), మదార్ బాష, బద్రి కాంగ్రెస్‌నాయకులు పాల్గొన్నారు.

**పేదల పక్షపాతి బాబూ జగ్జీవన్‌రామ్**

కడప (ఎర్రముక్కపల్లె), జూలై 6 : అట్టడుగు వర్గాల అభివృద్ధికి తన జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడు బాబూ జగ్జీవన్‌రామ్ అని సీపీఐ నాయకుడు చంద్ర తెలిపారు. శనివారం డీహెచ్‌పీఎస్ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ బాబు జగ్జీవన్‌రామ్ స్వాతంత్ర్య సమరయోధుడిగా, కేంద్ర మంత్రిగా, దేశ ప్రధానిగా దేశానికి ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఈ కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ నాయకులు మునెయ్య, చంద్రగుప్త, లింగన్న, చంద్ర, శివతేజ పాల్గొన్నారు.

**పీఆర్ఎస్‌వైఎఫ్ ఆధ్వర్యంలో...**

కడప నగరం జగ్జీవన్‌రామ్ సర్కిల్‌లో పీఆర్ఎస్ వైఎఫ్ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పీఆర్ ఎస్ వైఎఫ్ రాష్ట్ర కన్వీనరు శంకర్ మాట్లాడుతూ భారత తొలి ఉప ప్రధాని సమ సమాజ స్థాపనకు కృషి చేసిన కృషీవలుడు జగ్జీవన్‌రామ్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా కన్వీనరు ఓరుగంటి నాగేంద్రబాబు పాల్గొన్నారు.

**డిప్యూటీ మేయర్ ఆరిపుల్లా ఆధ్వర్యంలో...**

కడప నగరం జగ్జీవన్‌రామ్ విగ్రహానికి కడప మాజీ డిప్యూటీ మేయర్ ఆరిపుల్లా పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు మల్లేశ్, నాయకులు అబ్దుల్, కరీముల్లా పాల్గొన్నారు.

**సామాజిక విప్లవయోధుడు బాబు జగ్జీవన్‌రామ్**

కడప (సెవెన్‌రోడ్స్), జూలై 6 : జాతి అభ్యుదయం కోసం అహర్నిశలూ కృషి చేస్తూ విద్యార్థి దశలోనే అనేక వివక్షలు, అవమానాలను ఎదిరించి పోరాడిన సామాజిక విప్లవ యోధుడు, హరిత విప్లవ పితామహుడు బాబు జగ్జీవన్‌రామ్ అని గ్రేటర్ రాయలసీమ విద్యార్థి యువజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీఎం ఓబులేసు యాదవ్ కొనియాడారు.

జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఓబులేసు మాట్లాడుతూ ఒకవైపు దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడుతూనే, మరో వైపు సామాజిక సమానత్వం, కోసం అణగారిన వర్గాల హక్కుల కోసం అలుపెరగని సమరం సాగించిన సామాజిక విప్లవయోధుడు బాబు జగ్జీవన్‌రామ్ అన్నారు. ఈ కార్యక్రమంలో దళిత మిత్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కైపు రామాంజనేయులు, జీఆర్ఎస్‌వైఎఫ్ నాయకులు శివప్రసాద్, సాయి, ఎస్ఎఫ్ఐ జిల్లా నేత రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి జగ్జీవన్‌రామ్**

కడప (నాగరాజుపేట), జూలై 6 : బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి బాబు జగ్జీవన్‌రామ్ అని కడప జిల్లా దళిత ఎంఈఎఫ్ ఉద్యోగ సంఘ నాయకులు, కార్యవర్గ కమిటీ సభ్యులు అన్నారు. బాబుజగ్జీవన్‌రామ్ 38వ వర్ధంతి సందర్భంగా నగర నడిబొడ్డులో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలతో ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు పాల్గొన్నారు.

**సమతావాది బాబూ జగ్జీవన్‌రామ్**

కడప (మారుతీనగర్), జూలై 6: సమతావాది బాబూ జగ్జీవన్‌రామ్ అని ఆంధ్రప్రదేశ్ దళితమిత్ర సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కైపు రామాంజనేయులు కొనియాడారు. బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతిని పురస్కరించుకుని ఏపీ దళితమిత్ర సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక రైల్వేస్టేషన్ సమీప మహావీర్ సర్కిల్ వద్ద గల బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వై. వీరయ్య, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ప్రవీణ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు పి.మనోహర్, తదితరులు పాల్గొన్నారు.





కడప: జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డీహెచ్‌పీఎస్ నాయకులు.. నివాళులర్పిస్తున్న మాజీ డిప్యూటీ మేయర్.. పీఆర్ఎస్ఐ వైఎఫ్ ప్రతినిధులు

## మన చరిత బుక్‌లెట్‌ను ఆవిష్కరించిన కలెక్టరు

కడప (ఎడ్యుకేషన్), జూలై 6 :ఇన్‌టాక్ జిల్లా చాప్టరు ప్రచురిస్తున్న మన చరిత బుక్‌లెట్‌ను జిల్లా కలెక్టరు శివశంకర్, జేసీ గణేశ్‌తో కలి సి ఆవిష్కరించారు. శనివా రం కలెక్టరు ఛాంబరులో ఇన్‌టాక్ ఆధ్వర్యంలో కలెక్టరు నూతనంగా బాధ్యతలు చేపట్టిన కలెక్టరు శివశంకర్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఇం టాక్ ప్రచురణలను పరిశీలించి ఇన్ని పుస్తకాలు చేస్తున్నందుకు కలెక్టరు అభినందించారు. జిల్లా అభివృద్ధికి చేస్తున్న కృషిని ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఈ అంశాల పట్ల తనకు ఆసక్తి ఉందని అన్నారు. మన కలెక్టరేట్ పుస్తకాన్ని పరిశీలించి ఈ అంశంపై ప్రత్యేకంగా పుస్తకం చదవడం పట్ల జిల్లా పట్ల అభిమానం తెలుపుతుందన్నారు. అనంతరం ఇన్‌టాక్ కన్వీనరు చిన్నపరెడ్డి సభ్యులను కలెక్టరుకు పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో ఇంటాక్ ప్రతినిధులు గౌరీశంకర్, దేవతి రవి, డాక్టర్ ఆర్.రంగనాధరెడ్డి, ప్రొఫెసరు సాంబశివారెడ్డి, కె.రాఘవేంద్రవర్మ, డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరచారి పాల్గొన్నారు.

## చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

వీరపునాయునిపల్లె, జూలై 6: చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు లక్ష్మీదేవి, జయలక్ష్మి పేర్కొన్నారు. శనివారం స్థానిక సంగమేశ్వర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఐసీపీ స్థానంలో బీఎన్ఎస్, ఐఈఏ స్థానంలో బీఎస్ఏగా మార్పుచేసినట్లు వివరించారు. ఈ చట్టాలలోని పలు సెక్షన్లను వివరించారు. కావున చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, అలాంటప్పుడే మనం మోసపోకుండా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీసులు పాల్గొన్నారు.

### జగనన్న లేఅవుట్‌ను పరిశీలించిన బీజేపీ నాయకులు



పులివెందుల టౌన్, జూలై 6: పులివెందులలోని జగనన్న లేఅవుట్‌ను బీజేపీ జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూకేంద్ర ప్రభుత్వం సహకారంతో పేదలకు ఇళ్లు కట్టించాలన్న మోదీ ఆలోచనలకు అప్పటి జగన్ ప్రభుత్వం తూట్లు పొడిచిందన్నారు. కాంట్రాక్టర్ తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అవినీతితో పాటు లబ్దిదారుల నుచి రూ.30వేలు వసూళ్లలో పేదల కడుపుకొట్టారన్నారు. అసలు గుత్తేదారు అకౌంట్‌కు నేరుగా ప్రైవేట్ బ్యాంకు ద్వారా చెల్లింపులుజరగడం చరిత్రలో ఇది తొలిసారి అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు భానుప్రకాష్, మహేశ్వర్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, శ్రీరాములు, వాజ్‌పేయి, రామాంజనేయులు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



## గండి అభివృద్ధికి సహకరిస్తా: ఎమ్మెల్సీ


గండిలో హారతులు అందుకుంటున్న ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి

చక్రాయపేట, జూలై 6: గండి వీరాంజనేయస్వామి దేవస్థాన అభివృద్ధికి సహకరిస్తానని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన గండి అంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య ఆహ్వానించగా ప్రధాన అర్చకులు కేసరి, ఉప అర్చకుడు రాజారమేష్ స్వాగతం పలికారు. అనంతరం ఆంజనేయస్వామికి ఘనంగా పూజలు నిర్వహించి శాలువలు కప్పి ఆశీర్వచనం అందించారు. ఈ సందర్భంగా ఆయన గండి ఆలయంలో ఆగస్టులో ప్రారంభమయ్యే శ్రావణమాసోత్సవాల ఏర్పాట్లపై ఈఓను అడిగి తెలుసుకున్నారు. శ్రావణమాసోత్సవాల్లో గండి దేవస్థానానికి టీటీడీ నుంచి పారిశుధ్య కార్మికులు, సంబంధిత సామగ్రి, మొబైల్ టాయ్‌లెట్లు, కళాక్షేత్రం లాంటివి ఏర్పాటు చేస్తారని, ఈ ఏడాది కూడా అలాగే చేయాలని అర్చకులు, ఈఓలు కోరగా వినతిపత్రం పెడితే తాను మాట్లాడుతానని తెలిపారు. గండి ఆంజనేయస్వామికి రెండు కేజీల వెండి ఇస్తానని, దాంతో దేవునికి ఉపయోగపడే వస్తువులు చేయించాలని కోరగా, ప్రతిగ్రహపాత్ర (తీర్థపాత్ర) చేయిస్తామని అర్చకులు తెలిపారు. శ్రావణమాసోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. వేదపారాయణ పండితులు రామ్మోహన్‌శర్మ, గోపాలస్వామి, మాజీ ఎంపీటీసీ రమణ, భాను తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

### నీటి సమస్యను పరిష్కరించాలని వినతి

చక్రాయపేట, జూలై 6: జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు, గ్రామ ప్రజలకు హైస్కూల్‌లో ఉన్న మోటార్ నుంచి నీరు సరఫరా అవుతోంది. కానీ శుక్రవారం స్టార్టర్ కాలిపోవడంతో నీటి సమస్య తలెత్తింది. టీడీపీ నాయకుడు, దాసరి మెడికల్ స్టోర్ ఆంజనేయులు సచివాలయంలో వినతిపత్రం సమర్పించారు. వెంటనే నీటి సమస్య తీర్చాలని, లేకుంటే ఇబ్బందులు తలెత్తుతాయన్నారు.

## మొక్కలు నాటుదాం: ఎమ్మెల్యే మాధవి


మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే మాధవీరెడ్డి

కడప (ఎడ్యుకేషన్), జూలై 6 : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కడప ఎమ్మెల్యే మాధవీ పిలుపునిచ్చారు. శనివారం కడప సబ్‌జైలు సమీపంలో గల కడప వనంలో కార్పొరేషన్ ఆధ్వర్యంలో తల్లి పేరుతో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే మాధవి తన తల్లి లక్ష్మి పేరు మీద మొక్కలు నాటారు. అలాగే టీడీపీ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి తన తల్లి హేమలత పేరు మీద మొక్కలు నాటారు. అనంతరం వారు మాట్లాడుతూ మనం కాపాడే ప్రకృతి భావితరాలకు మంచి వరమన్నారు. మొక్కలు నాటి ప్రకృతిని కాపాడుకుందామని పిలుపునిచ్చారు.

**ప్రతి ఒక్కరూ మొక్కలు నాటండి**

పులివెందుల టౌన్, జూలై 6: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సీఐ మద్దిలేటి అన్నారు. ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు అమ్మ జ్ఞాపకార్థం ఒక చెట్టు నాటండి అనే కార్యక్రమాన్ని శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మద్దిలేటి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ మహేశ్వర్‌రెడ్డి, రాష్ట్ర సాంస్కృతిక విభాగం కన్వీనర్ భానుప్రకాష్, జిల్లా ఎస్సీ మోర్చా శ్రీరాములు, మండల అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

### పఠన సామర్థ్యాలు మరింత మెరుగుపడాలి: డీఈఓ


విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న డీఈఓ

కడప (ఎర్రముక్కపల్లె), జూలై 6 : విద్యార్థుల్లో పఠన సామర్థ్యాలను మరింత మెరుగుపరిచేందుకు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారిణి అనురాధ సూచించారు. శనివారం కడప నగరం వాటర్ గండి ఎంపీయూపీ పాఠశాలను ఆమె పరిశీలించారు. 5వ తరగతి విద్యార్థులతో పఠన సామర్థ్యాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే పాఠశాలల్లో మౌలిక వసతులు పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థులు పాఠ్యపుస్తకాల్లోని పాఠాలు, పాఠ్యేతర పుస్తకాలు చదివేలా తీర్చిదిద్దాలన్నారు. విద్యార్థుల్లో పఠనా పోటీతత్వం పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### రామచంద్రయ్యను కలిసిన తుంగా రమణయ్య


రామచంద్రయ్యకు శుభాకాంక్షలు తెలుపుతున్న రమణయ్య

కడప (ఎర్రముక్కపల్లె), జూలై 6 : ఎమ్మెల్సీగా ఎంపికైన సి.రామచంద్రయ్యను జనసేన నేత తుంగా రమణయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం కడప నగరం కో ఆపరేటివ్ కాలనీ ఎమ్మెల్సీ నివాసంలో ఎమ్మెల్సీ రామచంద్రయ్యను కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. రాజకీయంగా ఎంతో అనుభవం ఉన్న నేత రామచంద్రయ్య, ఆయన సేవలు ప్రస్తుత రాజకీయాల్లో ఎంతో అవసరమన్నారు. భవిష్యత్తులో మరిన్ని పదవులు పొందాలని ఆకాంక్షించారు. అలాగే డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ వ్యక్తిగత కార్యదర్శిగా పని చేసిన హరిప్రసాద్‌ను ఎమ్మెల్సీగా ఎన్నుకున్నందుకు శుభాకాంక్షలు తెలిపారు.

### విజయదుర్గమ్మ సేవలో ఎమ్మెల్సీ రామచంద్రయ్య


ఎమ్మెల్సీ రామచంద్రయ్యను సన్మానిస్తున్న విజయదుర్గ ఆలయ వ్యవస్థాపకుడు దుర్గా మల్లికార్జునరావు

కడప (కల్చరల్), జూలై 6: ఎమ్మెల్సీ రామచంద్రయ్య శనివారం కడపలోని విజయదుర్గాదేవి సేవలో తరించారు. అమ్మవారిని దర్శించుకుని ఆ తల్లి ఆశీస్సులు అందుకున్నారు. ఆయనకు ఆలయ వ్యవస్థాపకుడు మల్లికార్జునరావు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దుర్గాప్రసాద్ స్వాగతం పలికి ఎమ్మెల్సీ దంపతులకు వేద ఆశీర్వచనం ఇచ్చి అమ్మవారి పట్టు వస్త్రాలు అందజేశారు. రామచంద్రయ్య మాట్లాడుతూ అమ్మవారి గుడిని నిర్మించి తద్వారా ఎంతో మందికి ఆ తల్లి ఆశీస్సులను అందించేలా చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు.

### పాఠశాల నిర్వహణ నిధులు మంజూరు చేయాలి: ఎస్టీయూ

కడప (ఎర్రముక్కపల్లె), జూలై 6: పాఠశాలల నిర్వహణ నిధులను మంజూరు చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఇలియాస్‌బాషా డిమాండ్ చేశారు. శనివారం డీఈఓ కార్యాలయంలో డీఈఓ అనురాధకు వారు వినతిపత్రం అందించి చర్చించారు. అనంతరం వారు మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలుగా ప్రభుత్వ పాఠశాలలకు నిధులు మంజూరు చేయలేదన్నారు. దీంతో ప్రధానోపాధ్యాయులు తమ సొంత డబ్బును పాఠశాల నిర్వహణకు వెచ్చించారన్నారు. వర్షాకాలం ప్రారంభమైన పరిస్థితుల్లో సీజనల్ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందన్నారు. ఎంఈఓలను జిల్లా ఉన్నత స్థాయి అధికారులు అర్థం చేసుకోకుండా బాధ్యులను చేసి మాట్లాడడం భావ్యం కాదని, మెయింటెనెన్స్‌గ్రాంటు లేకుండా వాటర్ ట్యాంకుల పరిశుభ్రత ఎలా చేపట్టాలో చెప్పాలన్నారు. ఉపాధ్యాయుల పక్షాన మీరైనా పరిస్థితిని ఉన్నతాధికారులకు వివరించాలన్నారు. ఖాజీపేట ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయురాలు సస్పెన్షన్‌పై పునరాలోచించాలని, ఈ సమస్యను డిపార్ట్‌మెంటు తరపున రాష్ట్రస్థాయి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సంగమేశ్వర్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాలగంగిరెడ్డి, రాష్ట్ర కౌన్సిలరు చెన్నకేశవరెడ్డి పాల్గొన్నారు.

### విద్యార్థులను నిర్లక్ష్యం చేయడం సరికాదు: పీడీఎస్‌యూ


మాట్లాడుతున్న అంకన్న

కడప (ఎర్రముక్కపల్లె), జూలై 6 : మైదుకూరు నియోజకవర్గం ఖాజీపేట జడ్పీ పాఠశాలలో కలుషిత నీరు, ఉడకని అన్నం తిని అస్వస్థతకు గురై చికిత్స పొందుతున్న విద్యార్థులను జిల్లా విద్యాశాఖ అధికారులు పరామర్శించిన పాపాన పోలేదని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న తెలిపారు. శనివారం కడప నగరం పీడీఎస్‌యూ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు స్పం దించి రిమ్స్ నుంచి ఇతర మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌కు తక్షణమే విద్యార్థులను తరలించాలని డిమాండ్ చేశారు. ఖాజీపేటలో 15 మంది విద్యార్థినులు అనారోగ్యానికి గురయ్యారన్నారు. రిమ్స్ లో సరిగా వైద్యం చేయడం లేదని, స్వయాన విద్యార్థినులు తల్లిదండ్రులు, బంధువులు ఆరోపిస్తున్నా అక్కడ ఉన్న డాక్టర్లు పట్టించుకోలేదన్నారు. దీనిపై విద్యాశాఖ అధికారులు తక్షణం స్పందించాలని కోరారు. అలాగే రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్యే సుధాకర్‌యాదవ్‌లకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

### సచివాలయంలో సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాల ఆవిష్కరణ


చిత్రపటాలను ఆవిష్కరిస్తున్న టీడీపీ నేతలు

కడప (ఎర్రముక్కపల్లె), జూలై 6 : కడప నగరం 22వ డివిజన్ మారుతీనగర్ సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ చిత్రపటాలను ఆవిష్కరించారు. టీడీపీ నాయకులు శ్రీనివాసులు, జనార్ధనరెడ్డి, నాగసుబ్బయ్య, పవన్‌కుమార్, బాషా పాల్గొన్నారు.

### ఎరువుల దుకాణాలు తనిఖీ

పులివెందుల టౌన్, జూలై 6: పులివెందుల పట్టణంలోని ఎరువులు, పురుగు మందులు, విత్తన విక్రయ దుకాణాలను కమిషనర్ కార్యాలయం నుంచి స్పెషల్ స్క్వాడ్స్ బృందం శనివారం తనిఖీ చేశారు. తిరుపతి ఎస్‌టీఎల్ అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ కేఎంఈ ప్రసాద్, ఇన్‌స్పెక్టర్ బాషా తనిఖీ చేశారు. రూ. 2,52,486 విలువలైన బయో స్టిములేంట్స్ స్టాక్‌ను డిటెన్షన్ నోటీసులు ఇచ్చారు. ఏఓ గోవర్ధన్, పులివెందుల ఏఓ నాగలక్ష్మి పాల్గొన్నారు.

# జగనన్న కాలనీల్లో సమస్యలు

అధ్వానంగా రహదారులు ● మౌలిక వసతులు పూర్తయ్యేదెన్నడు..? ● పూర్తిస్థాయిలో భవన నిర్మాణాలు రూపుదిద్దుకునేదెప్పుడు..?

పోరుమామిళ్ల, జూలై 6 : గత ప్రభుత్వ హయాంలో జగనన్న కాలనీలు ఏర్పాటు చేసి లబ్ధిదారులకు అన్ని రకాల వసతులు కల్పిస్తామని చెప్పినా అవి పూర్తి స్థాయి లో అమలు కాలేదు. దాదాపు మూడేళ్లపాటు కాలనీల నిర్మాణం ప్రారంభమైనా ఇప్పటి వరకు ఎక్కడా పూర్తిస్థాయిలో భవనాలు పూర్తి కాలేదు. ప్రస్తుతం ప్రభుత్వం మారిన నేపథ్యంలో ఈ జగనన్న కాలనీలో మౌలిక వసతులు, రహదారులకు ఎప్పుడు మోక్షం లభిస్తుందోనని లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు. మండలంలో అక్కల్‌రెడ్డిపల్లె, పోరుమామిళ్ల, దమ్మనపల్లె, గానుగపెంట, కవల కుంట్ల, కొరపాటిపల్లె, నాగలకుంట్ల, పోరుమామిళ్ల, పుల్లీవీడు, రంగసముద్రం, సిద్దవరం, చల్లగిరిగెల, టేకూరుపేట, తిమ్మారెడ్డిపల్లె పం చాయతీలకు సంబంధించి 1308 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. లేఅవుట్ ఏర్పాటు చేయడంలో జాప్యం జరగడంతో మరి కొన్ని ప్రాంతాలకు తరలించే ప్రయత్నాలు చేశారు. అయిన ప్పటికీ ఇప్పటి వరకు ఆ కాలనీల్లో వాహనాలు వెళ్లేందుకు సరైన రహదారులు లేక లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని చోట్ల గృహ నిర్మాణాలు ప్రారంభిం చిన పాపాన పోలేదు. మరికొన్ని చోట్ల సిక్స్ లైన్స్ నిర్మాణంలో లబ్ధిదారులకు కేటాయించిన స్థలాలు పోతా యని ప్రత్యామ్నాయంగా వారికి స్థలాలు చూపిస్తామని చెప్పినా ఇంత వరకు వారికి



రంగసముద్రం పంచాయతీలో రహదారులు లేని జగనన్నకాలనీ

స్థలాలు కేటాయించిన దాఖలాలు లేవు. పుల్లీడు పంచాయతీకి సంబంధించి పేరమ్మగారిపల్లె సమీపంలో కొందరికి స్థలాలు కేటాయిం చినా బిల్లుల జాప్యమో, లబ్ధిదారుల సమస్యలో తెలియదు కానీ అక్కడా అసంపూర్తిగానే మిగిలిపోయాయి. మండల ంలో బీపీఎల్ స్థాయిలో 29 మంది లబ్ధిదారులు తమ నిర్మాణాలను చేస్తున్నారు. బీఎస్‌లెవల్‌లో దాదాపు 150 మంది లబ్ధిదారులు బేస్‌మట్టం లెవల్‌లోనే ఉండి పోయారు. 27 మంది లెంటల్ లెవల్‌లో నిర్మాణాలు పూర్తి చేసుకున్నారు. 170 మంది రూఫ్‌లెవల్‌లో తమ నిర్మాణాలు పూరి చేసుకున్నారు. 30 మంది ఆర్‌సీ లెవెల్ నిర్మాణాలు పూర్తి చేసుకున్నారు. 887 మంది లబ్ధిదారులు తమ నిర్మాణాలను పూర్తి చేసుకున్నారు. నీటి సౌకర్యం, విద్యుత్ సౌకర్యం కల్పించినా రహదారుల సౌకర్యం లేకపోవడంతో గృహ నిర్మాణాలకు ట్రాక్టర్ల ద్వారా మెటీరి యల్ తీసుకురావడానికి లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు చొరవ తీసుకుని తమ కాలనీల్లో రోడ్డు సౌకర్యం కల్పించాలని లబ్ధిదారులను కోరుతున్నారు.

**ప్రభుత్వానికి నివేదిక పంపాం...**

జగనన్నకాలనీలో రహదారుల పరిస్థితి గురించి హౌసింగ్ ఏఈ రమేశ్ దృష్టికి తీసుకెళ్లగా జగనన్న కాలనీకి సంబంధించి రహదారులకు ఎంత ఖర్చవుతుందో అంచనాలు వేసి జిల్లా అధికారులకు నివేదిక పంపా మన్నారు. ప్రస్తుతం కాలనీల్లో ఎన్ని గృహాలు పూర్తయ్యాయి, ఏవేవి ఏ దశలో ఉన్నాయి, ఆ వివరాలను కూడా జిల్లా అధికారులకు నివేదిక పంపామన్నారు. జిల్లా అధికారులు నిధులు మంజూరు చేస్తే మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు.

## అనాథ వృద్ధులకు న్యాయ సేవలు అందిస్తాం



భోజనాన్ని వడ్డిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి వైజే పద్మశ్రీ

బద్వేలు రూరల్, జూలై 6 : అనాథ వృద్ధులకు ప్రభుత్వం నుంచి రావలసిన విషయంలో కానీ లేదా మరీ ఏ ఇతర సమస్యలపై కానీ ఉచితంగా న్యాయ సేవలు అందిస్తామని మండల లీగల్ సర్వీసెస్ ఛైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి వైజే పద్మశ్రీ అన్నారు. శనివారం పట్టణంలోని ఆనందనిలయం నిరాశ్రయుల ఆశ్రమాన్ని తనిఖీ చేశారు. ఈ కారక్రమంలో మండల లీగల్ సర్వీసెస్‌బృందం, ప్రభుత్వ ఆసుపత్రి మెడకల్ సూపరింటెండెంట్, ఆశా వర్కర్లు, నిరాశ్రయుల ఆశ్రమ ప్రెసిడెంటు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు



బద్వేలు రూరల్, జూలై 6 : మున్సిపల్ పరిధిలోని వల్లెరవారిపల్లె గ్రామంలో ఉన్న లక్ష్మి నరసింహస్వామి ఆలయంలో ఆషాఢ మాసం మొదటి శనివారం సందర్భంగా స్వామి అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకం చేశారు. వేకువజామునే అభిషేకం అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పట్టణ గ్రామీణ ప్రాంత ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం నిర్వహించారు.

## కుందూనది బ్రిడ్జిపై సిమెంటు పిల్లర్స్ ఏర్పాటు చేయండి



సిమెంటు పిల్లర్స్‌లేని బ్రిడ్జి

చాపాడు, జూలై 6: మండలంలోని సీతారామపురం వద్ద ఉన్న కుందూ నది బ్రిడ్జిపై సిమెంటు పిల్లర్స్ ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. 1927లో బ్రిటీష్‌వారు ఈ బ్రిడ్జిని నిర్మించారు. కుందూ నదికి వరదనీరు ఎక్కువగా వచ్చినప్పుడు ఈ బ్రిడ్జిపైన రక్షణ కోసం ఈ పిల్లర్స్ ఉపయోగపడేవి. కానీ ఈ బ్రిడ్జిపై పలుమార్లు పిల్లర్స్ దెబ్బతిన్నాయి. మళ్లీ వాటిస్థానంలో కొత్తవి బిగించారు. కానీ మళ్లీ ఇప్పుడు కూడా సిమెంటు పిల్లర్స్ విరిగిపోయాయి. మరికొన్ని చాలా బలహీనంగా ఉన్నాయి. బ్రిడ్జి పొడవు 300 మీటర్లు ఉండగా బ్రిడ్జిపై వేసిన తారు రోడ్డు దెబ్బతినడంతో గుంతలు ఏర్పడాయి. ఈ బ్రిడ్జి మీద నుంచి అల్లాడుపల్లె, పెద్దగురవలూరు, చిన్నగురవలూరు, శ్రీరాములపేట, సన్నపల్లె, ఇంకా పలు గ్రామాల ప్రజలు వెళుతుంటారు. అల్లాడుపల్లె వీరభద్రస్వామి దేవాలయం వద్దకు కూడా ప్రొద్దుటూరు నుంచి వచ్చే భక్తులు ఈ బ్రిడ్జిపై నుంచి వెళుతుంటారు. ప్రతిరోజు కొన్ని వందల వాహనాలు వెళుతుంటాయి. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో కుందూ నదికి వరదలు వచ్చే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు ఈ బ్రిడ్జిపై పిల్లర్స్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## రోటరీనగర్ సమస్యలను పరిష్కరించండి



నెర్రెలు చీలిన రోటరీ నగర్ రోడ్డు

జమ్మలమడుగు, జూలై 6: జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలో మున్సిపల్ కార్యాలయానికి సమీపాన రోటరీ నగర్‌లో అన్నీ సమస్యలే. ప్రధానంగా రోడ్డు నెర్రెలు చీలినది. వర్షం వస్తే రోటరీనగర్ చుట్టూ వర్షపునీరు తాండవిస్తుంది. బైపాస్ రోడ్డు నుంచి ద్విచక్ర వాహనాలు, ఆటోలు రావాలన్నా ఇబ్బందికరంగా మారింది. రోటరీనగర్ వీధిలో రోడ్డుకు ఇరువైపుల కంపచెట్లు మొలిచాయి. వర్షపునీరు, కంపచెట్లు ఉండడంతో అపరిశుభ్రంగా మారి దోమలు, ఈగలు ఎక్కువగా ఉంటాయి. అయిదు సంవత్సరాల నుంచి ఆ ప్రాంతానికి చెందిన ప్రజలు మున్సిపల్ అధికారులకు సమస్యలు తెలియజేసినా కార్యాలయానికి పక్కనే ఉన్నప్పటికీ ఒక్క అధికారి రాలేదని అందుకే ప్రజలు కూడా గత ప్రభుత్వాన్ని అడ్రస్ లేకుండా చేసినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఏది ఏమైనా రోటరీ నగర్‌లో రైల్వేస్టేషన్ వెళ్లే దారి, బైపాస్ రోడ్డు అక్కడున్న సమస్యలను మున్సిపల్ అధికారులు పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి దృష్టికి సమస్యలు తీసుకెళ్లి పరిష్కరించాలని కోరినట్లు ప్రజలు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలని తెలిపారు.

## మందుబాబులకు నిలయంగా పార్కు



నిరుపయోగంగా మారిన పార్కులోని గదులు

జమ్మలమడుగు, జూలై 6 : జమ్మలమడుగు పట్టణంలోని ముద్దనూరు రోడ్డులో ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల పక్కన తాతిరెడ్డి నరసింహారెడ్డి పార్కు నిరుపయోగంగా మారింది. చుట్టుపక్కల కొందరు మద్యం తాగేవారు పార్కులో మద్యం తాగి అక్కడే ప్లాస్టిక్ సీసాలు, నీళ్ల ప్యాకెట్లు వదిలేసి వెళుతున్నారు. కొన్ని సంవత్సరాలుగా ఆ పార్కు నిరుపయోగంగా మారింది. కొత్తలో స్థానికంగా ఉన్నవారు వాకింగ్ చేయడానికి వెళ్లేవారు. ఆ పార్కులోనే ట్యాంకు నిర్మాణం ఇరుకుగా మారింది. అందులో నిర్మించిన రెండు నుంచి మూడు గదులు తలుపులు పగులకొట్టి నిరుపయోగంగా మార్చారు. అయితే అసాంఘికాలకు నిలయంగా మారినట్లు ఆరోపణలున్నాయి. చెత్తాచెదారంతో వ్యర్థాలు నిండి ఉంది. సంబంధిత అధికారులు శుభ్రత చేయించాలని కోరుతున్నారు.

# పసుపు సాగుపై రైతుల ఆసక్తి

రాజుపాలెం, జూలై 6 : పది సంవత్సరాలుగా సరైన ధరలు లేకపోవడంతో అరకొర పసుపు సాగు చేసిన రైతన్నలకు ఈ ఏడాది మంచి ధర లభించడంతో మళ్లీ పసుపు సాగు చేసేందుకు ఆసక్తి నెలకొంది. ఈ ఏడాది జూన్, జూలై మాసాల్లో సకాలంలో వర్షాలు పడడంతో భూమికి కూడా తగిన పదను లభించింది. దీంతో రైతన్నలు పసుపు విత్తనం మొదలుపెట్టారు. క్వింటాలు పసుపు ధర రూ.14వేల నుంచి రూ.15వేలు పలుకుతుండడంతో విత్తనం కూడా పుట్టి 15 వేలు చెల్లించి తెచ్చి సాగు చేసుకుంటున్నారు. మండలంలోని టంగుటూరు, దువ్వూరు కానగూడూరు, జిల్లెళ్ల, భాకరాపేట గ్రామాల్లో కుందూ, బోర్ల కింద దాదాపు 200 నుంచి 300 ఎకరాల పైబడి సాగులోకి



ఎద్దులతో సాళ్లు తోలుతున్న దృశ్యం

వస్తుంది. ఇటు వర్షం, అటు కేసీ కెనాల్‌కు కూడా నీళ్లు వస్తాయన్న ధైర్యంతో సాగుపై ఆసక్తి చూపుతున్నారు. ఎకరాకు 30 నుంచి 40వేలు కౌలు చెల్లించి విత్తనానికి మూడు పుట్ల ధర రూ30వేలు అయినా మొత్తం ఎకరాకు సాగుకు ఖర్చే రూ.70వేలు పైబడి వస్తున్నా రైతన్నలు పసుపు సాగు చేసుకునేందుకు వెనకాడడం లేదు. ఏదిఏమైనా ఈ సారి అనుకూలించి మంచి దిగుబడి రావడంతో పాటు సరైన గిట్టుబాటు ధర లభిస్తుందని రైతులు తెలిపారు.

## తైక్వాండో పోటీల్లో రాణించిన విద్యార్థులు

ప్రొద్దుటూరు టౌన్, జూలై 6: వైవీఎస్ మున్సిపల్ గర్ల్స్ హైస్కూలు, జవహర్ బాలకేంద్రం విద్యార్థులు అంతర్జాతీయ తైక్వాండో పోటీల్లో ప్రతిభ కనపరచి పతకాలు సాధించారు. నేపాల్ రాజధాని ఖాట్మాండ్‌లో ఇటీవల నిర్వహించిన ఇండో నేపాల్ అంతర్జాతీయ తైక్వాండో పోటీల్లో ప్రొద్దుటూరు విద్యార్థులు పాల్గొన్నారు. అండర్-12 సబ్‌జూనియర్ 33 కిలోల బాలుర విభాగంలో సుదీప్‌కుమార్ ప్రథమస్థానం సాధించగా సీనియర్ బాలుర 55 కిలోల విభాగంలో శివనాథ్ ప్రథమస్థానంలో నిలిచి బంగారు పతకాలు సాధించారు. పతకాలు సాధించిన విద్యార్థులను మాస్టర్ మునీశ్వర్, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

## వర్షపునీరు నిలువ లేకుండా చూసుకోవాలి



పాఠశాలను పరిశీలిస్తున్న అధికారులు

ఖాజీపేట, జూలై 6: ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో తమ పరిసర ప్రాంతాల్లో నీరు నిలువ లేకుండా చూసుకోవాలని ఎంపీడీవో ఎంవీ రమణ అన్నారు. శనివారం కస్తూర్బాగాంధీ విద్యాలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు డెంగ్యూ మాసోత్సవాలు మండల పరిధిలో నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి అయేషాసుల్తాన్, ఈవోపీఆర్‌డీ వెంకటసుబ్బారెడ్డి, ఆరోగ్య విస్తరణాధికారి నాగభూషణ, ఆశా నోడల్ ఆఫీసర్ అరుణకుమారి, సూపవర్‌వైజర్ శోభన్‌బాబు, ప్రధానోపాధ్యాయురాలు భార్గవి, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ బాబు, ఆశా కార్యకర్తలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నగదు బహుమతి అందజేత



కొండాపురం, జూలై 6 : మండలంలోని పొట్టిపాడు జడ్పీహైస్కూల్‌లో ఈ ఏడాది పదో తరగతి పరీక్షలలో పాఠశాలలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు పాఠశాల మ్యాథ్స్ టీచర్ యు.రామసుబ్బయ్య నగదు బహుమతిని అందజేశారు. బి.తనయ్ కుమార్(539 మార్కులు)కు రూ.5000, కె.గురుహేమతేజ(525 మార్కులు)కు రూ.2000,ఎం అనూషా(505 మార్కులు)కు రూ.1000 తన సొంత డబ్బులతో నగదు బహుమతిని అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం నాగార్జున, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన ఎంవీ రమణ

ఖాజీపేట, జూలై 6: ఎంపీడీవో కార్యాలయంలో పరిపాలనాధికారిగా పనిచేస్తున్న ఎంవీ రమణ శనివారం ఎంపీడీవోగా అదనపు బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంపీడీవో నంద్యాలజిల్లాకు బదిలీ కావడంతో వారి స్థానంలో సీఈవో ఆదేశాల మేరకు ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల పరిధిలో ఎక్కడ మంచినీటి కొరత రాకుండా చేపట్టాలని, ప్రతి పంచాయతీ పరిశుభ్రతగా ఉండేలా అధికారులు చూడాలన్నారు.

## ప్రతి విద్యార్థి కష్టపడి చదవాలి

బద్వేలుటౌన్, జూలై 6 : ప్రతి విద్యార్థి చిన్నవయస్సు నుంచే కష్టపడి చదివినప్పుడే అనుకున్న లక్ష్యాలను నెరవేర్చుకోగలరని ఎంఈవో రఘురాములు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు వెంగల్‌రెడ్డి, డెమోక్రటిక్ పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు రవిశంకర్ పేర్కొన్నారు. శనివారం శీలంవారిపల్లె, వల్లెలవారిపల్లెల్లో రవిశంకర్ ఆధ్వర్యంలో విద్యార్థినీ విద్యార్థులకు ఎన్‌ఆర్‌ఐ సాయిశ్రీలక్ష్మి, మల్లికార్జుననాయుడు సహకారంతో విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాఠశాల విద్యాకమిటీ ఛైర్మన్ బాలక్రిష్ణ, టీడీపీ నాయకులు శంకర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, జయసుబ్బారెడ్డి, కొండయ్య, ఓబులరెడ్డి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## సబ్‌జైలును తనిఖీ చేసిన జడ్జి

జమ్మలమడుగు, జూలై 6: జమ్మలమడుగు పట్టణంలో శనివారం జూనియర్ సివిల్‌జడ్జి ఎస్.భార్గవి జమ్మలమడుగులోని సబ్‌జైలును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా రికార్డులు పరిశీలించి జైలులో రిమాండ్ ఖైదీలు ఎంతమంది ఉన్నారు, వారితో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సబ్‌జైలులో జడ్జి మాట్లాడుతూ రిమాండ్ ఖైదీలకు ఉచిత న్యాయ సలహాలు, కేసులకు సంబంధించి వివరించారు. మోటారు వెహికల్ యాక్టును వివరించారు. ఈ కార్యక్రమంలో సబ్ జైలు సూపరింటెండెంట్ హర్షవర్ధన్‌రెడ్డి, న్యాయవాది సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## ఉచితంగా యాంటీ రేబీస్ టీకాలు

ముద్దనూరు జూలై6: మండలంలోని ప్రభుత్వ పశువైద్యశాలలు, రైతు సేవా కేంద్రాల వద్ద శనివారం ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా పెంపుడు కుక్కలకు యాంటీ రేబీస్ టీకాలు వేశారు.ఈ సందర్భంగా ఇన్‌చార్జి సహాయసంచాలకులు వాసా శ్రీనివాసులు మాట్లాడుతూ కుక్క కాటు వల్ల మనుషులకు రేబీస్ వ్యాధి సోకకుండా యాంటీ రేబీస్ టీకాలు వేశామన్నారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది సూర్యబాబు, శశిరేఖ, నాగమయ్య, యాసీన్, లావణ్య, నాగయ్య పాల్గొన్నారు.

**ప్రొద్దుటూరు టౌన్..:** పెంపుడు జంతువులకు తప్పనిసరిగా రేబిస్‌వ్యాక్సిన్ వేయించాలని శ్రీ వెంకటేశ్వర పశువైద్య కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ శ్రీనివాసప్రసాద్ పేర్కొన్నారు. శనివారం ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా పశువైద్య కళాశాలలో ఉచిత యాంటీ రేబిస్ టీకా శిబిరంనిర్వహించారు. ఈ కార్యక్రమంలో పశువైద్యులు అనూష, విజయలక్ష్మి, జ్యోతి, సుభాషిణి, రేవతి, సుదర్శన్, విద్యాసాగర్, పశువైద్య విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పారిశుధ్య కార్మికులందరినీ విధుల్లోకి రప్పించాలి

ప్రొద్దుటూరు టౌన్, జూలై 6: ఇతర విధుల్లో ఉన్న పారిశుధ్య కార్మికులందరినీ వెంటనే పారిశుధ్య విధుల్లోకి రప్పించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకుడు మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డికి శనివారం వినతి పత్రం అందజేశారు. అనంతరం ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు, ఏపీ మున్సిపల్స్ వర్కర్స్ యూనియన్ ఉప ప్రధాన కార్యదర్శి రవిప్రసాద్‌లు మాట్లాడుతూ ప్రభుత్వం డివిజన్ కార్యాలయాల వద్ద మస్టర్‌ను రద్దు చేసి సచివాలయాలకు అప్పగించిందన్నారు. అప్పటి నుంచి నకిలీ మస్టర్లు వేస్తూ మున్సిపాలిటీని మోసం చేస్తున్నారని తెలిపారు. ఈ విధానం వలన కొంతమంది కార్మికులు ఎక్కడ విధులు నిర్వహిస్తున్నారో తెలియడంలేదన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మల, ప్రమీలా రాణి, నాగమ్మ పాల్గొన్నారు.

## విద్యార్థులు నైతిక విలువలు అలవర్చుకోవాలి

ప్రొద్దుటూరు టౌన్, జూలై 6: విద్యార్థులు నైతిక విలువలు అలవర్చుకోవాలని ఎంఈవోలు సావిత్రమ్మ, శోభారాణి పేర్కొన్నారు. శనివారం రమణ మహర్షి హైస్కూలులో 10వ తరగతి హైస్కూలులో ప్రతిభ కనపరచిన విద్యార్థులకు పూర్వ విద్యార్థులు నగదు పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుల సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, చాపాడు మండల ఎంఈవో వంశీకృష్ణ, పాఠశాల అధ్యక్షుడు వెంకటరమణ, ప్రధానోపాధ్యాయులు రవిప్రకాశ్, సుబ్రమణ్యం, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ మొక్క నాటండి

బి.కోడూరు, జూలై 6 : భారతీయ జన సంఘ్ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ జయంతిని పురస్కరించుకుని దేశ ప్రధాని ఒక మొక్క అమ్మకోసం అనే నినాదంతో కార్యక్రమానికి పిలుపునిచ్చారు. అందులో భాగంగా బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు తిప్పలూరు రామసుబ్బారెడ్డి అధ్యక్షతన శనివారం బి.కోడూరు గవర్నమెంటు హైస్కూలులో ఒక మొక్క అమ్మ కోసం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే విజయమ్మ మాట్లాడుతూ రామసుబ్బారెడ్డి ప్రారంభించిన కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని విరివిగా మొక్కలు నాటాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట కార్యవర్గసభ్యుడు కేవీ లక్ష్మీనారాయణరెడ్డి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యద ర్శి ఉట్టి శ్రీనివాసులు, బీజేపీ యువమోర్చా జిల్లా అధ్యక్షుడు బొమ్మన విజయ్, టీడీ పీ నాయకులు రామచంద్రారెడ్డి, గోడిరమణారెడ్డి, ఓ.రమణారెడ్డి, మిషన్ దుగ్గిరెడ్డి, నవీన్, శేషారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, కాసా వెంకట సుబ్బారెడ్డి, దుగ్గిరెడ్డి, పవన్, చెన్నారెడ్డి, రవిక్రిష్టారెడ్డి,మద్దిరెడ్డి, నరసింహులు, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

**ప్రభుత్వ వైద్యశాలలను పరిశీలించిన విజయమ్మ..:** మండల పరిధిలోని ప్రాధమిక ప్రభుత్వ వైద్యశాలను శనివారం మాజీ ఎమ్మెల్యే విజయమ్మ పరిశీలించారు. ఆసుపత్రిలో సేవలు ఎలా కొనసాగుతున్నాయి సిబ్బంది



బీకోడూరులో మొక్కను నాటుతున్న విజయమ్మ, పోరుమామిళ్లలో రోగులకు పండ్లు, బ్రెడ్డు పంపిణీ చేస్తున్న బొజ్జ రోశన్న

కొరత, విషయాలపై వైద్యాధికారి వినీత్ రాజ్‌కుమార్ ను అడిగి తెలుసుకున్నారు.

**పోరుమామిళ్ల..:** మొక్కలు నాటండి పర్యావరణం పరిరక్షించండని కూటమి అభ్యర్థి బొజ్జరోశన్న అన్నారు. శనివారం బీజేపీ నాయకులు డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముకర్జీ జయంతి సందర్భంగా పోరుమామిళ్లలోని ప్రభుత్వ వైద్యశాలలో బీజేపీ అధ్యక్షుడు నాగేంద్ర ఆధ్వర్యంలో రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం వైద్యశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో కో-కన్వీనరు పండరి, ఎంపీటీసీ కల్వకూరి రమణ, ఓబీసీ మోర్చా నాయకులు రమణచారి, వంకధారి జయరాజ్, రవీంద్ర, టీడీపీ నాయకులు తిరుమలశెట్టి సుబ్బారావు, సోమిరెడ్డి అతికారి రాజా, మస్తాన్ పాల్గొన్నారు.

**మైదుకూరు రూరల్..:** ప్రతి ఒక్కరూ తన ఇంటి పరిసరాలలో మొక్కలను నాటి పర్యావరణాన్ని కాపాడాలని జిల్లా న్యాయమూర్తి శ్రీదేవి అన్నారు. శనివారం పట్టణంలోని కోర్టు ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి జూనియర్ సివిల్ జడ్జిషేక్ ఖాజామొహిద్దీన్,డీఎస్పీ వెంకటేశ్, కమిషనర్ జబ్బార్ మియా,బాల వెంకటయ్య,సెక్రటరీ జయరాం, సీనియర్ న్యాయవాదులు ఆర్ శ్రీనివాసులు, కామనూరు శ్రీనివాసులు పాల్గొని మొక్కలు నాటారు.